16-04-2025
బుధవారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 205 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

JB
జయభేరి



## కులగణన మోడీకి మరణ శాసనం

**ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని కొన్ని సమస్యలకు మన ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందన్నారు.**

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 15:**
శంషాబాద్ నోవాటెల్ లో జరిగిన సీఎల్పీ మీటింగ్ లో రేవంత్ మాట్లాడారు. సన్నబియ్యం పథకం ఒక అద్భుతమని.. ఆనాడు రూ.2 కిలో బియ్యంలా ఇప్పుడు సన్నబియ్యం పథకం శాశ్వతంగా గుర్తుండే పథకమన్నారు. భూ భారతిని రైతులకు చేరవేయాలని.. దేశంలోనే ఇందిరమ్మ ఇండ్లు పథకం ఆదర్శంగా నిలిచిందని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో నిజమైన లబ్ది దారులకు ఇందిరమ్మ ఇండ్లు అందాలని స్పష్టం చేశారు. కులగణన ద్వారా వందేళ్ల సమస్యను శాశ్వతంగా పకడ్బందీగా పరిష్కరించామని.. విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బిల్లులు తీసుకొచ్చామని.. ఇది మన పారదర్శక పాలనకు నిదర్శనమని గుర్తు చేశారు. జఠిలమైన ఎస్సీ ఉపకులాల వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. అందుకే వర్గీకరణ జరిగే వరకు ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేద ని.. మనం తీసుకున్న గొప్ప నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రేపటి నుంచి జూన్ 2 వరకు


...మిగతాది 2 లో



## బెదిరించే వాళ్ల పేర్లు పింక్ బుక్ లో రాసుకుంటున్నాం


**జయభేరి, బాన్సువాడ :**
బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేసారు. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తున్న కాంగ్రెస్ నాయకులపై ఎమ్మెల్సీ కవిత ఫైర్ అయ్యారు. బాన్సువాడలో బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశంలో ఆమె పాల్గొన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్లవద్దని కొంత మంది ఫోన్లు చేసి బెదిరిస్తున్నట్లు తెలిసింది. ఎవరెవరు బెదిరిస్తున్నారో వాళ్ల పేర్లను బరాబర్ పింక్ బుక్కులో రాసుకుంటాం. బెదిరింపులకు పాల్పడేవారిని ఎట్టిప రిస్థితుల్లో వదిలిపెట్టేదే లేదని అన్నారు. కేసులు పెట్టించే పోలీస్ స్టేషన్లకు ఈడ్చిన వాళ్లను క్షమించే ప్రసక్తే లేదు. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించే కాంగ్రెస్ నాయకులు, అధికారులు ఎవరైనా ఊరుకునేదే లేదు. కాంగ్రెస్ నాయకుల తాటాకు చప్పుళ్లకు భయపడేదే లేదు. వాళ్ల తాతలు, ముత్తాతలు, జేజమ్మలు ఎవరు దిగొచ్చినా కూడా భయపడేవాళ్లెవరూ లేరు ఇక్కడ . మాట తప్పడమే... మడమ తిప్పడమే కాంగ్రెస్ నైజం. సోనియా

...మిగతాది 2 లో




## ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు చెక్కులు అందజేత

**జయభేరి, సిద్దిపేట :**
మంత్రులతో కలిసి వివిధ జిల్లాలలో ఎంపిక చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదా రులలో బేస్ మెంట్ లెవెల్ పూర్తి చేసిన లబ్ధిదారులకు వారి చేతుల మీదుగా లక్ష రూపాయల చెక్కును అందజేశారు. సిద్ధిపేట జిల్లా నుండి బేస్మెంట్ లెవెల్ పూర్తిచేసిన లబ్ధిదారులలో ఎంపికైన వారు. కోహెడ మండలం పోరెడ్డి పల్లి గ్రామం దబ్బెట రాజవ్వ, సిద్ధిపేట రూరల్ మండలం వెంకటాపూర్ గ్రామం గోపగాని లచ్చవ్వ వీరిరువురికి ముఖ్యమంత్రి లక్ష రూపాయల చెక్కును అంద జేశారు. అనంతరం సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ కి సీఎం అందించిన చెక్కులు చూపిస్తూ లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ చేతుల మీదుగా చెక్కులు స్వీకరించారు.
జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా చెక్కులు స్వీకరించిన ఇద్దరు లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇప్ప టివరకు జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లు పతకం మొదలైన తర్వాత 2667 ఇండ్ల మంజూరు, 606 ఇందిర ఇండ్లు ముగ్గు పోసారని , 156 బేస్ మెంట్ లెవెల్ పూర్తయ్యాయనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ పీడీ దామోదర్ రావు, ఆయా మండల ఎంపీడీవోలు పంచాయతీరాజ్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



## పేదలకు అండగా బాబుమోహన్ చారిటబుల్ ట్రస్ట్

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 15:**
ప్రముఖ సినీ నటుడు, మాజీ మంత్రి బాబు మోహన్ తన కుమారుడి జ్ఞాపకార్థం 'పవన్ బాబుమోహన్ ఛారిటబుల్ ట్రస్ట్'ను స్థాపించారు. ఈ ట్రస్ట్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న నిరుపేదలకు చేయూత అందించనున్నారు. సోమవారం బషీర్ బార్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన ఆవిర్భావ సమావేశంలో బాబు మోహన్ ట్రస్ట్ లక్ష్యాలు, కార్యక్ర మాలను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి అనుమతి పొందిన ఈ ట్రస్ట్.. నిరుపే దలకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను కల్పించడంపై ప్రధానంగా దృష్టి సారిస్తుందని ఆయన తెలిపారు. నిరుద్యోగులకు చేయూత అందించడం కూడా ట్రస్ట్ ముఖ్య లక్ష్యాలలో ఒకటిగా పేర్కొన్నారు. బాబు మోహన్ మాట్లాడుతూ.. తన

...మిగతాది 2 లో



## ఎస్సీ వర్గీకరణకు ఆర్డినెన్స్

**జయభేరి, విజయవాడ, ఏప్రిల్ 15:**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో మూడు గంటల సేపు మంత్రి వర్గ సమావేశం జరిగింది. 24 అంశాలపై ఈ సమావేశంలో చర్చ జరిపి నిర్ణయాలు తీసుకున్నారు. పలు కీలక అంశాలు, అభివృద్ధి పనులపై నిర్ణయాలు తీసుకున్నారు. మే రెండో తేదీన అమరావతికి మోదీ వస్తారని చంద్రబాబు మంత్రులకు తెలిపారు. సీఆర్డీఏ 46వ ఆథారిటీలో అమోదించిన అంశాలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అమరావతి నిర్మాణం కోసం అవసరమైన నిధులు సమీకరించుకునేందుకు సీఆర్డీఏ కమిషనర్‌కు కేబినెట్ అనుమతి ఇస్తూ నిర్ణయం తీసుకుంది. అలాగే నూతన అసెంబ్లీ, హైకోర్టు భవనాల టెండర్లకు అంగీకారం తెలిపింది. టెండర్లలో ఎల్ 1గా నిలిచిన కంపెనీకి పనులు అప్పగించేందుకు నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ భవన నిర్మాణానికి రూ. 617 కోట్లు, హైకోర్టు నిర్మాణానికి రూ.786 కోట్లు, ఎల్ 1 బిడ్డర్‌లకు లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ అందజేసేందుకు ఏపీ సీఆర్డీఏ కమిషనర్‌కు అధికారాన్ని కట్టబెడుతూ కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. క్లైమేట్ గవర్నెన్స్ మెకానిజాన్ని అభివృద్ధి చేయడం క్లైమేట్ యాక్షన్ ప్లాన్, డేటా డ్రివన్ ప్లానింగ్ కెపాసిటీ బిల్డింగ్ కోసం స్టేట్ క్లైమేట్ సెంటర్‌ను మూడు నగరాల్లో ఏర్పాటు చేయడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం నడిం పాలెంలో వంద బెడ్లతో ఈఎస్ఐ ఆస్పత్రికి స్టాఫ్ క్వార్టర్స్‌కు భూమి కేటాయింపులకు కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. . ద్వారకా తిరుమల మండలం రాఘవాపురంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి 30 ఎకరాలు భూమిని ఉచితంగా కేటాయించారు. ఐదో ఎస్ఐపీబీ సమావేశంలో రూ.30,667 కోట్లు

...మిగతాది 2 లో

## ఆ వాహనాలకు నో పెట్రోల్



**జయభేరి, న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:**
మీరు ఢిల్లీలో నివసిస్తుంటే, మీకు 10 సంవత్సరాల పాత వాహనం ఉంటే, మీరు ఈ వార్త తెలుసుకోవడం చాలా ముఖ్యం. కాలుష్యాన్ని నియంత్రించడానికి ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. మీ వాహనం పాతదైతే, పెట్రోల్ పంప్ నుండి పెట్రోల్ వేసుకోలేరని గుర్తించుకోండి.పాత వాహనాలకు సంబంధించి ఢిల్లీ ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. 2024 నుండి ఢిల్లీలో 10 సంవత్సరాల కంటే పాత డీజిల్ వాహనాలు,

...మిగతాది 2 లో




## గ్రూప్ వన్ వివాదాలు.. ఫుల్ స్టాప్ ఎప్పుడు

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 15:**
తెలంగాణలో 2024 అక్టోబర్‌లో జరిగిన గ్రూప్1 మెయిన్స్ పరీక్షల ఫలితాలు తీవ్ర వివాదానికి దారితీశాయి. ఈ పరీక్షల్లో 563 పోస్టుల కోసం 31,383 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. అయితే, ఫలితాల్లో అనేక అనుమానాస్పద

...మిగతాది 2 లో

## లక్ష్మణరేఖ దాటేస్తున్నారా...

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## కులగణన మోడీకి మరణశాసనం

ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో ప్రతీ గ్రామం పర్యటించేలా కార్యాచరణ తీసుకోవాలని సూచించారు. నేను కూడా మే 1 నుంచి జూన్ 2 వరకు ప్రజలతో మమేకం అవడానికే సమయం కేటాయిస్తానని ప్రకటించారు. హెచ్ సీ యూ భూములపై ప్రతిపక్షం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తో ఒక అబద్ధపు ప్రచారం చేసిందని.. ఈ ప్రచారాన్ని ప్రధాని మోదీ కూడా నమ్మి బుల్డోజర్లు పంపిస్తున్నారని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీజేపీ, బీఆరెస్ కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయన్నారు. పార్టీ, ప్రభుత్వం ప్రతిష్ఠ పెరిగితేనే భవిష్యత్ ఉంటుంది.. మనం ఎంత మంచి చేసినా.. ప్రజల్లోకి తీసుకెళ్లకపోతే ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలి.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిందేనన్నారు. మీ నియోజకవర్గంలో ఏం కావాలో ఒక నివేదిక తయారు చేసుకోండి.. ఆ పనులను పూర్తి చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. నిన్న మొన్నటి వరకు బండి సంజయ్, కిషన్ రెడ్డి మనపై విమర్శలు చేశారు.. ఇప్పుడు ఏకంగా ప్రధాని మోదీనే రంగంలోకి దిగారు. తెలంగాణ పథకాలతో ప్రధాని మోదీ ఉక్కిరి, బిక్కిరి అవుతున్నాడు.. వర్గీకరణ మోదీకి గుదిబండగా మారింది.. కులగణన మోదీకి మరణశాసనం రాయబోతోందన్నారు. దేశంలో తెలంగాణ మోడల్ పై చర్చ జరుగుతోంది. అందుకే తెలంగాణలో కాంగ్రెస్ ను ఇబ్బంది పెట్టాలనే బీజేపీ, బీఆరెస్ ఒక్కటయ్యాయని ఆరోపించారు. సన్న బియ్యం బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలన్నారు. సన్న బియ్యం మన పథకం.., మన పేటెంట్, మన బ్రాండని స్పష్టం చేశారు. మంత్రి పదవులు ఆశిస్తున్న వారు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడటం వల్ల వారికే సమస్యలు వస్తాయని రేవంత్ గుర్తు చేశారు. ఎంపీ చామలపై రేవంత్ మండిపడ్డారు. ఆయన పలువురు పేర్లు పరిశీలనలోకి తెస్తున్నారన్నారు. హైకమాండ్ ఇప్పటికే నిర్ణయం తీసుకుందని.. ఇష్టం వచ్చినట్లుగా ప్రకటనలు వద్దని పార్టీ నేతలకు హెచ్చరికలు పంపారు.

## ఎస్సీ వర్గీకరణకు ఆర్డినెన్స్

పెట్టుబడులు, 32,133 ఉద్యోగాలు వచ్చే ప్రతిపాదనలను ఆమోదించారు. వాటికి కూడా కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖపట్నంలో టీసీఎస్ కంపెనీ ఏర్పాటుతో సహా పలు కంపెనీల పెట్టుబడులకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆర్డినెన్స్‌పై మంత్రి మండలిలో చర్చించి ఆమోదం తెలిపింది. జాతీయ ఎస్సీ కమిషన్ నుంచి వచ్చిన ఎస్సీ వర్గీకరణ నివేదికపై మంత్రివర్గంలో కీలక చర్చ జరుగుతోంది. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదికను శాసనసభలో ఆమోదించి జాతీయ ఎస్సీ కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది. జాతీయ ఎస్సీ కమిషన్ పరిశీలన తర్వాత తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక వచ్చింది. కుప్పం నియోజకవర్గంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు, నెల్లూరులో ఏపీఐఐసీకి, విజయనగరం జిల్లాలో గ్రే హౌండ్స్‌కు భూములను కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కేబినెట్ భేటీ ముగిసిన తరవాత మంత్రులతో బాబు రాజకీయ అంశాలపై చర్చించినట్లుగా తెలుస్తోంది. వైఎస్ఆర్‌సీపీ ఫేక్ న్యూస్ తో మత విద్వేషాలు పెంచాలనుకుంటోందని.. ఈ విషయంలో మంత్రులు చురుకుగా స్పందించడం లేదని అసహనం వ్యక్తం చేసినట్లుగా తెలుస్తోంది. ప్రభుత్వ కార్యక్రమాలను బలంగా ప్రజలలోకి తీసుకెళ్లాలని ఎన్ని సార్లు చెప్పినా మంత్రుల్లో స్పందన ఉండటం లేదని ఆగ్రహం వ్యక్తం చేసినట్లుగా తెలుస్తోంది.

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కేబినెట్ సమావేశానికి హాజరయ్యారు కానీ ఎక్కువ సేపు ఉండలేదు. ఆయన అనారగ్యంతో ఉండటంతో.. కేబినెట్ భేటీకి హాజరై వెంటనే వెళ్లిపోయారు. పవన్ కల్యాణ్ ఇటీవల అరకు పర్యటనలో ఉన్నప్పుడే సింగపూర్ తన కుమారుడికి అగ్నిప్రమాదం గురించి తెలిసింది. మానసికంగా ఒత్తిడికి గురైన పవన్ కల్యాణ్.. కుమారుడ్ని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసిన తర్వాత హైదరాబాద్ వచ్చారు. కానీ ఆయన అలసటకు గురయ్యారు. ఈ కారణంగా ఆయన సతీమణి అన్నా లెజ్ నోవా ఒక్కరే తిరుపతికి వెళ్లి మొక్కులు సమర్పించుకున్నారు. కేబినెట్ భేటీ కోసం ఆయన అమరావతికి వచ్చినప్పటికీ.. ఆరోగ్యం సహకరించలేదు. కేబినెట్ సమావేశానికి హాజరై...కూర్చోలేని పరిస్థితి ఉండటంతో విషయం చెప్పి వెళ్లిపోయారు. కేబినెట్ సమావేశం గురించి ప్రభుత్వ సమాచార మంత్రిత్వ ఫోటోలు రిలీజ్ చేసింది ఈ ఫోటోల్లో పవన్ కల్యాణ్ కుర్చీ ఖాళీగా ఉంది. అయితే అధికార వర్గాలు మాత్రం పవన్ కేబినెట్ సమావేశానికి వచ్చారని కానీ అనారోగ్యం కారణంగా ఉండలేకపోవడంతో వెళ్లిపోయారని క్లారిటీ ఇచ్చారు. పవన్ కల్యాణ్ గతంలోనూ అనారోగ్యం కారణంతో ఒకటి, రెండు సార్లు కేబినెట్ సమావేశానికి హాజరు కాలేదు. అనారోగ్యం కారణంగా చికిత్స తీసుకుంటూ ఉండిపోయారు. కుమారుడి ప్రమాదం కారణంగా పవన్ కల్యాణ్ మానసికంగా అలసిపోయారని.. ఇప్పుడు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనేంత పరిస్థితుల్లో లేరని జనసేన పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రెండు, మూడు రోజుల విశ్రాంతి తర్వాత ఆయన మళ్లీ అధికారిక సమీక్షలు ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. అయనకు ఉన్న కొన్ని ఆరోగ్య సమస్యలు, నడుం నొప్పి వంటి వాటికి చికిత్స నిర్లక్ష్యం చేయడంతో సమస్యలు పెరిగిపోయినట్లుగా తెలుస్తోందిప్రస్తుతం పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ హైదరాబాద్ లో ఉన్నారు. సింగపూర్ లో బ్రాంకోస్కోప్ చికిత్స చేయడంతో.. ఇక్కడ ఫాలో అప్ ట్రీట్మెంట్ చేయించాల్సి ఉంది. ఉపిరి తిత్తుల్లోకి పొగ పోవడం వల్ల చాలా సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. వాటిని తగ్గించాలంటే.. ముందస్తుగా ఇప్పుడు చికిత్స కీలకం. పవన్ మార్క్ శంకర్ ఆరోగ్య పరిస్థితిని దగ్గరుండి చూసుకుంటున్నారు.

## పింక్ బుక్ లో రాసుకుంటున్నాం

గాంధీ, రాహుల్ గాంధీ సంతకాలు పెట్టిన గ్యారెంటీ కార్డులను కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి పంచి ఓట్లేయించుకున్నారు. ఇప్పుడు గ్యారెంటీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నది. గతంలో తెలంగాణ ఇస్తామని హామీ ఇచ్చి పదేళ్ల పాటు అరిగోస పెట్టింది కాంగ్రెస్ పార్టీ. వందలాది మంది తెలంగాణ బిడ్డల ఆత్మబలిదానాలకు కారణం కాంగ్రెస్ పార్టీ. ఏడాదిన్నర పాలనలోనే ఇంత వ్యతిరేకత మూటగట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నోబుల్ ప్రైజ్ ఇవ్వాలి. ప్రతీ ఇంటి నుంచి ఒకరు రజతోత్సవ సభకు రావాలి . తెలంగాణ గడ్డ మీద అగ్గిపెట్టించి రాష్ట్రాన్ని సాధించిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది. నలిగిపోయిన ఆత్మగౌరవాన్ని రెపరెపలాడించింది బీఆర్ఎస్ పార్టీ. స్వతంత్ర దేశంలో లక్ష్యాన్ని చేరిన ఒకైక పోరాటం కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ఉద్యమం మాత్రం. వీరులు మాత్రమే లక్ష్యం చేరే వరకు పోరాటం చేస్తారు... అది కేసీఆర్ తో మాత్రమే సాధ్యమైంది. ప్రజాస్వామ్య పంథాను నమ్ముకొని హింసాయుతంగా పోరాటం చేసి తెలంగాణ సాధించాము. త్యాగాలతో తెలంగాణ కోసం కేసీఆర్ మొదటి అడుగు వేశారని అన్నారు. కేంద్ర మంత్రి పదవిని సైతం గడ్డిపోచలా వదిలేసిన ఘనత కేసీఆర్ ది. ఎవరో భిక్షపెడితేనో, ఎవరో దయదలచి ఇస్తే తెలంగాణ రాలేదు. కేసీఆర్ త్యాగం, కృషి, పోరాటపటిమ వల్ల తెలంగాణ సాధ్యమైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తెలంగాణలో కటిక చీకటి వస్తుంది, నక్సలైట్ల రాజ్యం వస్తుంది అప్పటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కానీ తెలంగాణ వచ్చిన తర్వాత వెలుగు జిలుగుల తెలంగాణను తయారు చేసుకున్నాం.బ కోటి ఎకరాల మాగాణను తయారు చేసుకున్నాం. సాగు నీళ్ల పన్ను మాఫీ చేసిన వ్యక్తి కేసీఆర్. రైతు బంధు, రైతు బీమా వంటి అనేక కార్యక్రమాలను కేసీఆర్ చేపట్టారు. చివరి గింజ వరకు వడ్లు కొని చరిత్ర సృష్టించింది కేసీఆర్ అని అన్నారు.

## ఆ వాహనాలకు నో పెట్రోల్

15 సంవత్సరాల కంటే పాత పెట్రోల్/సీఎన్జీ వాహనాల రిజిస్ట్రేషన్ రద్దు చేసినట్లు రవాణా శాఖ మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ నిబంధనల పరిధిలోకి వచ్చే వాహనాల సంఖ్య 55 లక్షలకు పైగా ఉంది. అంతేకాకుండా అటువంటి వాహనాలను బహిరంగ ప్రదేశాల్లో పార్కింగ్ చేయడం పూర్తిగా నిషేధించింది. ఇప్పుడు కారు యజమానులు ఆశ్రయించగల కొన్ని ఎంపికలు ఉన్నాయి. బహిరంగ ప్రదేశాల్లో పార్కింగ్ నిషేధం తర్వాత, యజమానులు ప్రైవేట్ పార్కింగ్ స్థలాలను మాత్రమే ఉపయోగించుకోవచ్చు. మీ వాహనం 10 సంవత్సరాలు (డీజిల్) లేదా 15 సంవత్సరాలు (పెట్రోల్, సీఎన్జీ) పూర్తి చేసి ఉంటే, దానిని NCR నుండి బయటకు రావాలంటే ఒక సంవత్సరం లోపు ఎన్వోసీ పొందడం తప్పనిసరి. ఇది కాకుండా, స్క్రాపింగ్ కూడా చివరి ఎంపికగా అందుబాటులో ఉంది. మీరు స్వచ్ఛంద వాహన స్క్రాపింగ్ అప్లికేషన్ ద్వారా మీ వాహనాన్ని స్క్రాప్ చేస్తే కొత్త వాహనం కొనుగోలుపై మీకు మోటారు వాహన పన్ను మినహాయింపు లభిస్తుంది. ఢిల్లీలో పాత వాహనాలను నడిపినా లేదా బహిరంగ ప్రదేశాల్లో పార్క్ చేసినా, మీకు రూ.5,000 నుంచి రూ.10,000 వరకు జరిమానా విధించవచ్చు. అలాగే, మీ వాహనాన్ని కూడా జప్తు చేయవచ్చు. ఢిల్లీ ప్రభుత్వం 477 పెట్రోల్ పంపులలో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయబోతోంది. ఈ వ్యవస్థ సహాయంతో వాహనాల వయస్సుకు సంబంధించిన డేటా అందుబాటులో ఉంటుంది. మీ వాహనం నిర్దేశించిన పరిమితి కంటే పాతదైతే, దానికి పెట్రోల్/డీజిల్‌ను వేయించుకోలేరని గుర్తించుకోండి.

# లక్ష్మణరేఖ దాటేస్తున్నారా...

**దేశానికి రాష్ట్రపతి ఎంత కీలకమో రాష్ట్రాలకు గవర్నర్ పదవి అంతే కీలకం. వీళ్లద్దరూ భారత రాజ్యాంగ బద్దంగా ప్రభుత్వాలు నడుస్తున్నాయో లేదో చూడాలి తప్ప రాజకీయ పార్టీల్లా పాలిటిక్స్ చేస్తే పనిచేయదని క్లారిటీ ఇచ్చింది. గవర్నర్ల విచక్షణాధికారానికి కత్తెర వేసింది. రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్న గవర్నర్ల వల్ల అత్యున్నతమైన ఆ ఉన్నత వ్యవస్థకు ఇలాంటి నిబంధనలు విధించాల్సి వచ్చింది. అయితే, ఇకపై ఇలాంటి పరిస్థితిలో మార్పు వస్తుందని అంతా ఆశీస్తున్నారు.**



గవర్నర్ల నియామకంలో మార్పులు వచ్చినా రాకపోయినా.. ఇప్పుడు, సుప్రీం తీర్పుతో.. గవర్నర్లు దారిలోకి వస్తారనడంలో సందేహం లేదు. ఇక, ఎలాగూ కేంద్రంలో ఉన్న అధికార పార్టీకి కూడా దాదాపు హెచ్చరికలు వెళ్లినట్లే భావించాలి గనుక.. సుప్రీం కోర్టుకు వ్యతిరేకంగా, రాజ్యాంగానికి విరుద్ధంగా నడుచుకునే సాహసం అయితే చేయరనే అభిప్రాయాలు ఉన్నాయి. ఇండియాలో పాలిటిక్స్ ఎంత పీక్స్‌లో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అయితే, పాలనలో మాత్రం స్వార్థపూరిత రాజకీయాలు ఉండకూడదనే ఉద్దేశంతోనే రాజ్‌భవన్‌కు కూడా రాజ్యాంగం అధికారాలు ఇచ్చింది భారత రాజ్యాంగం. ఒకవేళ, ప్రజా ప్రతినిధులు రాజకీయాలు చేస్తున్నా.. రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వాలకు సక్రమమైన సలహాలు ఇవ్వడానికి రాజ్‌భవన్‌లో ఉండే రాష్ట్రపతికి, గవర్నర్లకు విచక్షణాధికారాలు కూడా కట్టబెట్టింది. అయితే, ఇక్కడ కూడా పొలిటికల్ వ్యవహారాలకే పెద్దపీట వేస్తున్న పరిస్థితి.

"నా ప్రభుత్వం ఫలానా పని చేసిందని గర్వగా చెబుతున్నాను" అనాల్సిన గవర్నర్లు ఆ ప్రభుత్వాలతోనే ఫైట్ చేస్తున్నారు. వివాదాస్పద బిల్లులైతే ఓకే గానీ.. పాలనా పరమైన కీలక బిల్లుల్ని కూడా పక్కనపెట్టేస్తోంది రాజ్‌భవన్. కొన్ని సందర్భాల్లో పాలనకు కూడా అడ్డొస్తున్నారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లుల్ని రాజ్‌భవన్‌లోనే తొక్కి పెట్టి, కక్ష్యపూరింతంగా వ్యవహరిస్తున్నారు. గవర్నర్‌లను రాజకీయంగా ఉపయోగించుకునే దుస్థితి ఇప్పటిది కాకపోయినప్పటికీ--- ఇటీవల కాలంలో ఇది మరింత దిగజారింది. అందుకే, సుప్రీం కోర్టు ఫైనల్ రూల్ ఇచ్చేసింది. ఇకపై బిల్లులను ఇష్టం వచ్చినట్లు ఆపేస్తామంటే కదరదనీ.. గవర్నర్ల విచక్షణాధికారానికి సుప్రీం కోర్టు కత్తెర వేసింది. ప్రజాస్వామ్యాన్ని దాటి గవర్నర్లకైనా--- రాష్ట్రపతికైనా సూపర్ అధికారాలు లేవంటూ కుండబద్దలు కొట్టింది. దశాబ్దంగా దేశంలోని పలు రాష్ట్రాల గవర్నర్ల తీరుపై సుప్రీం కోర్టుకు ఫిర్యాదులు వెళ్తున్నాయి. అసెంబ్లీలో ఆమోదించి, రాజ్‌భవన్‌కు పంపుతున్న బిల్లులను సంవత్సరాల తరబడి ఆపేస్తున్నారంటూ ఆందోళనలు వచ్చాయి. దేశ రాజధాని ఢిల్లీ నుండి కేరళ, తమిళనాడు, తెలంగాణా, పశ్చిమ బెంగాల్, పంజాబ్, జార్ఖండ్ వరకు... తమ గవర్నర్లపై ఆ రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోపణలు గుప్పించాయి. కొందరైతే ఇంకాస్త ముందుకెళ్లి గవర్నర్‌ను తొలగించమని వినతులు కూడా పెట్టారు. ఆయా రాష్ట్రాలు..'తమ గవర్నర్లు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీల కొమ్ముకాస్తున్నారని' చెబితే... 'గవర్నర్ ఎందులోనైనా కలుగచేసుకుంటారు' అనే స్థాయిలో గవర్నర్లు మాట్లాడారు. అయితే, ఈ పరిస్థితి నాన్ బిజెపి ప్రభుత్వం ఉన్న దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ కనిపించింది. కొన్ని రాష్ట్రాల్లో అయితే ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం కంటే కేంద్రం నామినేట్ చేసిన గవర్నర్‌దే రూలింగ్ అనే లెవల్‌కు వెళ్లింది.

దేశంలోని మాజీ న్యాయమూర్తులు కూడా ఈ ధోరణిని రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. వామపక్ష పార్టీలైతే... గవర్నర్ పదవిని "అసంబద్ధం"గా పేర్కొంటూ రద్దు చేయాలని కూడా డిమాండ్ చేశాయి. ఇక, ఈ యుద్ధానికి ఇప్పుడు ముగింపు వచ్చింది. ఇటీవల, తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి తీరుపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీమ్ కోర్టుకు వెళ్లగా.. అత్యున్నత న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది. ఏప్రిల్ 11న ఈ తీర్పు కాపీని బహిరంగపరిచింది కోర్టు. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి వర్సెస్ తమిళనాడు ప్రభుత్వం కేసులో దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ సంచలన తీర్పు ఇచ్చింది. రాష్ట్ర శాసనసభ పంపించిన బిల్లులను ఆమోదించకుండా పక్కన పెట్టే అధికారం గవర్నర్‌కు లేదని తేల్చి చెప్పింది. అలాంటి వీటో అధికారాలు గవర్నర్‌కు ఉండబోవని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్ధివాలా, జస్టిస్ ఆర్ మహాదేవన్‌తో కూడిన ఇద్దరు సభ్యుల ధర్మాసనం ఈ మేరకు కీలక తీర్పును వెలువరించింది. తమిళనాడు అసెంబ్లీ తీర్మానించి రాజ్‌భవన్‌కు పంపించిన 10 బిల్లులకు సంబంధించి 2020 నుండీ గవర్నర్ ఆర్ఎన్ రవి ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా ఉండటం చట్టవిరుద్ధమని ప్రకటించింది. సాధారణంగా రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను గవర్నర్ తన అంగీకారాన్ని తెలియజేయాల్సి ఉంటుంది.

రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఆ బిల్లులు ఉంటేనే గానీ వాటిని పునఃపరిశీలనకు పంపించే అవకాశం దాదాపుగా ఉండదు. అయితే, తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన అనేక బిల్లులను గవర్నర్ రవి ఆమోదించకుండా ఉద్దేశపూరకంగా అడ్డుకుంటున్నారనేది ప్రభుత్వం వాదన. దీన్ని తమిళనాడు ప్రభుత్వం సుప్రీం కోర్టులో సవాలు చేయగా... రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం, గవర్నర్ తన విధులను నిర్వర్తించడానికి స్పష్టంగా కాలపరిమితి లేదని, ఎలాంటి సమయ పరిమితులు లేనప్పటికీ, తనకు అందిన బిల్లులను ఆమోదించకపోవడం, దీనివల్ల రాష్ట్రంలో చట్టాల రూపకల్పన ప్రక్రియను ఆలస్యం చేయడానికి అంగీకరించినట్టయిందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ చర్యలు తీసుకోవడానికి గడువును నిర్దేశిస్తూ.. కోర్టు ఆదేశాలు జారీ చేయడం ఇదే ప్రథమం. 'బిల్లులపై ఎలాంటి చర్యలూ తీసుకోకుండా ఆలస్యం చేయడం ద్వారా రాష్ట్రంలో శాసన నిర్మాణ వ్యవస్థకు గవర్నర్ అవరోధం కలిగించవచ్చన్న అర్థం వచ్చేలా రాజ్యాంగంలోని 200వ అధికరణాన్ని చదువుకోకూడదు' అని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ఆర్టికల్ 200ని ఆర్టికల్ 163తో పాటు చదవాలని కోర్టు వెల్లడించింది. దీని ప్రకారం.. క్యాబినెట్ సలహా మేరకు గవర్నర్ చర్య తీసుకోడానికి కట్టుబడి ఉండాలని" పేర్కొంది. నిజానికి, గవర్నర్ స్థాయిలో ఉన్నవారికి కోర్టుల నుండి మొట్టికాయలు పడటం.. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన పదవిలో ఉన్న వ్యక్తిని రాజ్యాంగబద్ధంగా నడుచుకోమని పదేపదే చెప్పాల్సిరావడం ఆ పదవికి, మొత్తంగా రాజ్‌భవన్‌కే అవమానంగా మారుతున్న పరిస్థితి. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలకు, రాష్ట్రాల అధికారాలకు తాము అతీతులమన్న తరహాలో వ్యవహరిస్తున్న గవర్నర్లకు ఈ తీర్పు స్పష్టమైన హెచ్చరికే అనుకోవాలి. కాలపరిమితులను దాటితే గవర్నర్ల నిర్ణయాలు కూడా న్యాయసమీక్ష ముందు నిలవాల్సివస్తుందన్న సూచన చాలా మార్పులను తీసుకొస్తుందనడంలో సందేహం లేదు. ఇది, ఇకపై రాష్ట్ర ప్రభుత్వాలకు, గవర్నర్లకు మధ్య సఖ్యతను కుదురుస్తుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.



## గ్రూప్ వన్ వివాదాలు.. ఫుల్ స్టాప్ ఎప్పుడు

అంశాలు బయటపడ్డాయని, ఇది భారతదేశంలోనే అతిపెద్ద పరీక్షా కుంభకోణంగా ఉండవచ్చని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకులు ఆరోపిస్తున్నారు. ఒకే హాల్ టికెట్ వరుసలో ఉన్న వందలాది మంది అభ్యర్థులకు ఒకే మార్కులు రావడం, కొన్ని పరీక్షా కేంద్రాల నుంచి అసాధారణ సంఖ్యలో టాపర్‌లు రావడం వంటి అంశాలు వివాదానికి కారణమయ్యాయి. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించిన గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షల ఫలితాలు 2025 ఏప్రిల్‌లో విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో ఒకే హాల్ టికెట్ వరుసలో ఉన్న 654 మంది అభ్యర్థులకు ఒకే మార్కులు, మరో వరుసలో 702 మందికి ఒకే మార్కులు రావడం సంచలనం రేపింది. ఈ అసాధారణ ఫలితాలు పరీక్షల మూల్యాంకనంలో పారదర్శకత లోపించిందని, సాంకేతిక లేదా మానవ తప్పిదాలు జరిగి ఉండవచ్చని అనుమానాలకు దారితీశాయి. హైదరాబాద్‌లోని కొన్ని పరీక్షా కేంద్రాల నుంచి అసాధారణ సంఖ్యలో టాపర్‌లు రావడం మరో వివాదాస్పద అంశం. కేవలం రెండు కేంద్రాల నుంచి 74 మంది టాపర్‌లు రావడం, 15 కేంద్రాల నుంచి అన్ని ర్యాంకులు రావడం సందేహాలను రేకెత్తించాయి.

బీఆర్ఎస్ నాయకుల ఆరోపణల ప్రకారం, 563 పోస్టుల్లో టాప్ 500 ర్యాంకుల్లో ఒక్క తెలుగు మీడియం విద్యార్థి కూడా చోటు సంపాదించలేదు, ఇది మూల్యాంకనంలో పక్షపాతం ఉందనే అనుమానాలను బలపరిచింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఈ ఫలితాలను "భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద పరీక్షా కుంభకోణం"గా అభివర్ణించారు. ఆయన ఈ అనుమానాస్పద ఫలితాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులకు తెలంగాణ యువత పట్ల చిత్తశుద్ధి ఉంటే, వారు వెంటనే ఈ కుంభకోణంపై సీబీఐ విచారణకు మద్దతు ఇవ్వాలని ఆయన సవాలు విసిరారు. మూల్యాంకనంలో మూడవ దశ తనిఖీ జరగలేదని, రెండవ దశ మూల్యాంకనం కాంట్రాక్ట్ సిబ్బంది చేతిలో జరిగిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఇది ప్రొఫెసర్‌లు లేదా శాశ్వత సిబ్బంది చేయాల్సిన పనిని అనధికార వ్యక్తులకు అప్పగించినట్లు చెప్పారు. పరీక్షలకు సంబంధించిన డేటా లీక్ అయినట్లు కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు అవసరమని డిమాండ్ చేశారు.

ఈ వివాదాస్పద ఫలితాల నేపథ్యంలో హైదరాబాద్‌లోని అశోక్ నగర్‌లో వందలాది గ్రూప్ 1 అభ్యర్థులు నిరసనలు చేపట్టారు. ఈ ఫలితాలను రద్దు చేసి, పారదర్శకంగా మళ్లీ మూల్యాంకనం చేయాలని వారు డిమాండ్ చేశారు. అశోక్ నగర్, సివిల్ సర్వీసెస్ కోచింగ్ కేంద్రాలకు కేంద్రంగా ఉండడంతో, ఈ నిరసనలు తీవ్ర రూపం దాల్చాయి. నిరసనకారులను అడ్డుకునేందుకు పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. కొందరు అభ్యర్థులను నిర్బంధించి, వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు, దీనిపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తీవ్రంగా స్పందించారు. రాజకీయ మద్దతు: బీఆర్ఎస్‌తో పాటు, బీజేపీ నాయకులు కూడా అభ్యర్థులకు మద్దతుగా నిలిచారు. గతంలో బీజేపీ నాయకుడు బండి సంజయ్ కూడా గ్రూప్ 1 అభ్యర్థుల నిరసనలకు మద్దతు ప్రకటించారు, అయితే సీబీఐ విచారణపై బీజేపీ నుంచి స్పష్టమైన స్పందన ఇంకా రాలేదు. తెలంగాణ గ్రూప్ 1 పరీక్షల చుట్టూ గతంలో కూడా అనేక వివాదాలు చోటు చేసుకున్నాయి. 2022, 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పరీక్షలు పేపర్ లీక్ ఆరోపణలతో రద్దయ్యాయి. ఈ నేపథ్యంలో, 2024లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలపై కూడా అనుమానాలు రావడం రాష్ట్రంలో యువతలో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. 2024లో జరిగిన గ్రూప్ 1 పరీక్షలకు ముందు జీవో 29పై కూడా తీవ్ర వివాదం చెలరేగింది. ఈ జీవో రిజర్వేషన్ నిబంధనలను మార్చిందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ విషయంపై సుప్రీం కోర్టులో కేసు కొనసాగుతోంది. గతంలో జరిగిన పేపర్ లీక్ ఘటనలు, ఇప్పుడు ఫలితాల్లో అనుమానాస్పద అంశాలు టీజీపీఎస్సీ నిర్వహణలో పారదర్శకత లోపించిందనే ఆరోపణలను బలపరుస్తున్నాయి. ఈ విషయాన్ని రాజకీయంగా వినియోగించుకునే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తోంది. అదే సమయంలో, బీజేపీ కూడా ఈ వివాదంపై స్పందించాల్సిన ఒత్తిడిలో ఉంది, ఎందుకంటే అభ్యర్థులు బీజేపీ మద్దతు కోరుతున్నారు. ఈ వివాదం రాష్ట్రంలో ఉద్యోగార్థులను నిరాశపరిచింది. గత 13 ఏళ్లలో గ్రూప్ 1 పరీక్షలు కేవలం రెండుసార్లు మాత్రమే జరగడం, ప్రతీసారి వివాదాలు తలెత్తడం వల్ల యువతలో ప్రభుత్వంపై విశ్వాసం సన్నగిల్లుతోంది.

## పేదలకు అండగా బాబుమోహన్ చారిటబుల్ ట్రస్ట్

కుమారుడి పేరుతో ఏర్పాటు చేసిన ఈ ట్రస్ట్ ద్వారా సమాజంలోని బలహీన వర్గాలకు సహాయం అందించాలనేది తన చిరకాల కోరిక అని అన్నారు. పేదరికం నుంచి బయటపడటానికి విద్య ఒక ముఖ్యమైన సాధనమని ఆయన నొక్కి చెప్పారు. అందుకే.. ట్రస్ట్ ద్వారా నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు.. వారికి నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. అలాగే.. సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్న వారికి సహాయం అందించడం కోసం.. వైద్య శిబిరాలు నిర్వహించడం, ఆసుపత్రి ఖర్చుల కోసం ఆర్థిక సహాయం చేయడం వంటి కార్యక్రమాలను ఈ ట్రస్ట్ చేపడుతుందని బాబు మోహన్ తెలిపారు. ఉపాధి లేని యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి.. వారు ఉద్యోగాలు పొందేలా సహాయం చేస్తుందన్నారు. ట్రస్ట్ ద్వారా సహాయం పొందాలనుకునే వారు కోఆర్డినేటర్ రాజ్ కుమార్‌ను 8919511215 నెంబర్ ద్వారా సంప్రదించవచ్చని బాబు మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం బండారు గూడెం కోయజాతికి చెందిన సమీప అనే విద్యార్థి ఎంటెక్ చేయడానికి, గ్రూప్స్ కోచింగ్ తీసుకోవడానికి బాబు మోహన్ తన ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. బాబు మోహన్ కుమారుడు పవన్ కుమార్ 2003 అక్టోబర్ 12న జరిగిన హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. స్పోర్ట్స్ బైక్ అదుపుతప్పి డివైడర్‌ని ఢీ కొట్టడంతో ఆయన ప్రాణాలు కోల్పోయారు. కొడుకు మరణంతో బాబు మోహన్ ఎంతగానో కుంగిపోయారు. కొడుకు పేరిట సేవా కార్యక్రమాలు చేపట్టాలని తాను ఎంతో కాలంగా భావిస్తున్నానని.. కానీ రాజకీయాల్లో బిజీగా ఉండటం వల్ల కుదరలేదన్నారు. తాను ఇప్పుడు రాజకీయాలకు దూరంగా ఉండటం వల్ల పూర్తి స్థాయిలో ట్రస్ట్ కోసం పని చేస్తానని ఆయన చెప్పారు. అయితే గత ఏడాది అక్టోబర్లో బాబు మోహన్ టీడీపీ సభ్యత్వం తీసుకోవడం గమనార్హం. ఒక గిరిజన విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించడానికి సహాయం చేయడం ట్రస్ట్ లక్ష్యానికి నిదర్శనమని బాబు మోహన్ తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి.. ఎక్కువ మంది నిరుపేదలకు సహాయం అందించడానికి తమ ట్రస్ట్ కృషి చేస్తుందని ఆయన తెలిపారు.

# రజతోత్సవ సభ ప్రతిష్ఠాత్మకం

- ఉమ్మడి మెదక్ జిల్లా నుండి లక్ష మంది తరలింపు
- ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి

✍ జయభేరి, గజ్వేల్, ఏప్రిల్ 15 :



బిఆర్ఎస్ పార్టీ 25 ఏండ్ల రజతోత్సవ ప్రస్థానంలో వరంగల్ సభ అత్యంత ప్రతిష్టాత్మకమని శాసనమండలి సభ్యులు డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి పేర్కొన్నారు. వర్గల్, గజ్వేల్ లలో మంగళవారం నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గులాబీ పార్టీ అధినేత కెసిఆర్ సారథ్యంలో స్వరాష్ట్రాన్ని సాధించి సగౌరవంగా బిఆర్ఎస్ జండా రెపరెపలాడుతుండగా, ఉమ్మడి మెదక్ జిల్లా నుండి లక్ష మందికి తగ్గకుండా రజతోత్సవ సభకు తరలి రావాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా తెలంగాణ ప్రజల కోట్లాది గొంతుకలను ఏకం చేసి సమైక్యపాలకుల కుట్రలు, కుతంత్రాలను తిప్పికొడుతూ ప్రత్యేక రాష్ట్ర కల సాకారం చేసిన కెసిఆర్ చరితను ఎవరూ కాదనలేని సత్యమని స్పష్టం చేశారు.

ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంతోపాటు పదేళ్లపాటు స్వర్ణ యుగాన్ని తలపించేలా పాలన చేసిన ఆయన పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి వందలాది పథకాలకు రూపకల్పన చేసి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచినట్లు తెలిపారు. అలాంటి నేతకు బాసటగా నిలుస్తూ పార్టీ శ్రేణులు పూర్వవైభవాన్ని తెచ్చే బాధ్యతను భుజాన వేసుకోవాలని చెప్పారు. అయితే రాష్ట్రంలో గజ్వేల్ నియోజకవర్గానికి అత్యంత ప్రాధాన్యత ఉండగా, కెసిఆర్ గౌరవాన్ని మరింత ఇనుమడింపజేసే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యకర్తలకు ప్రతిక్షణం తాము అందుబాటులో ఉంటామని,p త్వరలోనే కెసిఆర్ ను గజ్వేల్ నియోజకవర్గ కార్యకర్తలు కలిసి ముచ్చటించే విధంగా ఏర్పాటు చేస్తామని అన్నారు. అన్ని రంగాల్లో గజ్వేల్ ప్రాంతాన్ని తీర్చిదిద్దిన ఆయనకు రుణపడి ఉండాలని, పార్టీ కార్యకర్తలే బ్రాండ్ అంబాసిడర్లని పేర్కొన్నారు. రైల్వే లైన్ ఏర్పాటు, వివిధ పరిశోధన, యూనివర్సిటీల స్థాపన, జిల్లా ఆసుపత్రి, ఎడ్యుకేషన్ హబ్, మహతి ఆడిటోరియం, సమీకృత భవన సముదాయం, వెజ్ నాన్ వెజ్ మార్కెట్ వంటి అభివృద్ధి పనులు చిరస్థాయిగా నిలుస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి గుప్త, వైస్ చైర్మన్ జకియోద్దీన్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ వూడెం కృష్ణారెడ్డి, నాచగిరి ట్రస్ట్ బోర్డ్ మాజీ అధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్, పట్టణ పార్టీ అధ్యక్షులు నవాజ్ మీరా, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సంతోష్ గుప్త తదితరులు పాల్గొన్నారు.



## కట్ట మైసమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఏనుగు సుదర్శన్ రెడ్డి

✍ జయభేరి, ఏప్రిల్ 16:

శామీర్ పేట్ లోని పెద్ద చెరువు వద్ద ఉన్న కట్టమైసమ్మ అమ్మవారిని బిజెపి మేడ్చల్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్ రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ పూజారులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. అదే విధంగా శామీర్ పేట కు చెందిన బీజేపీ జిల్లా నాయకులు దుండగుల మైసయ్య నివాసంలో జరిగిన ఎల్లమ్మ పండగ వేడుకల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మ వారి కృపా కటాక్షలతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని వారు వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో శామీర్ పేట మండల అధ్యక్షులు కొరివి కృష్ణ ముదిరాజ్ , నాయకులు శ్రీకాంత్ రెడ్డి, పవన్ గౌడ్, బోయిన్ శివ, శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రస్మా మేడ్చల్ జిల్లా నూతన అధ్యక్షునిగా శ్రీకాంత్ రెడ్డి నియామకం



✍ జయభేరి, ఏప్రిల్ 16:

శామీర్ పేట మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాల యాజమాన్యం సంఘం (ట్రస్మా) జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎన్ రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్ రెడ్డి, అధికార ప్రతినిధి రామచందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లేష్, గొనె హనుమంత్ రెడ్డి, రాంనర్సయ్యలు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. అనంతరం ట్రస్మా జిల్లా అధ్యక్షునిగా కాప్రా మండలానికి చెందిన శ్రీకాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కుత్బుల్లాపూర్ కు చెందిన బిర్రు ఆంజనేయులు, కోశాధికారిగా మేడ్చల్ కు చెందిన గిరిబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు శ్రీకాంత్ రెడ్డి, ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారం పై నిరంతరం పోరాడతామన్నారు. తమ ముందు ఎన్నో సమస్యలు ఎదురు కాబోతున్నాయని, వాటనన్నింటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సంఘటితంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు కరస్పాండెంట్లు అభినందనలు తెలిపారు. కాగా ఎన్నికల అధికారులుగా రాంచందర్, రాంరెడ్డి, సత్యారెడ్డి లు వ్యవహరించారు.

## నిధుల మంజూరు కొరకు




✍ జయభేరి, మార్కుక్, ఏప్రిల్ 15 :

మండల కేంద్రంలోనీ పాములపర్తి గ్రామలో ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో రుముల మంజూరు చేయాలని ఏఈ తో తాజా మాజీ సర్పంచ్ తిర్మల్ రెడ్డి మాట్లాడారు.వారు సానుకూలంగా స్పందించడం జరిగింది అన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కనకయ్య గౌడ్, ఉపసర్పంచ్ పద్మనర్సింలు, వార్డు మెంబెర్ నాగరాజు, లక్ష్మణ్,స్వామి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

- లబ్ధిదారుడికి చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు




✍ జయభేరి, ములుగు, ఏప్రిల్ 15 :

చిన్న తిమ్మాపూర్ ఒంటిమామిడి గ్రామపంచాయతీలో కన్నెబోయిన శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయం నిధి(సీఎం రిలీఫ్ ఫండ్) నుండి మంగళవారం రూ 22500 చెక్కును లబ్ధిదారుడికి పంపిణీ చేయడం జరిగింది.అనంతరం లబ్ధిదారుడు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఊరట లభించింది అని ఎంతో ఆనందం వ్యక్తం చేశారు మరియు కాంగ్రెస్ ప్రభుత్వానికి గౌరవ ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ములుగు మండలం ప్రెసిడెంట్ తమ్మల శ్రీనివాస్, ప్రభాకర్ సేటు,ఒంటిమామిడి గ్రామ సీనియర్ నాయకుడు కన్నెబోయిన భద్రయ్య యాదవ్, కడపల కృష్ణారెడ్డి బలిపురం మనీ రెడ్డి మరియు వంటిమామిడి గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులు దకూరి అర్జున్, మహమ్మద్ సలీమా, గుండ్లపల్లి వెంకటేష్ గౌడ్, బలిజ కవిత ,బలిజ వెంకటేష్, కన్నెబోయిన శేఖర్ యాదవ్, తదితరులు పాల్గొనారు.



## ఉప్పరిపల్లిలో వ్యక్తి అదృశ్యం

- పోలీసులకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు

✍ జయభేరి, ఏప్రిల్ 16:

ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మేడ్చల్ జిల్లా ఉప్పర్ పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. శామీర్ పేట మండలం ఉప్పర్ పల్లి గ్రామానికి చెందిన ముద్దంగుల లక్ష్మీ నారాయణ (45) ఫిబ్రవరి 14 న బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. పరిసర ప్రాంతాలలో మరియు బంధువుల ఇళ్లలో వెతికిన కూడా అతని ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు శామీర్ పేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. బయటకు వెళ్లినప్పుడు నల్లటి ప్యాంట్, నీలం రంగు షర్టు వేసుకున్నాడని ఎత్తు 5.5 ఉంటాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక



✍ జయభేరి, గజ్వేల్, ఏప్రిల్ 15 :

గజ్వేల్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు 202526 సంవత్సరానికిగాను ఎన్నికలు నిర్వహించడం జరిగింది. ఈ ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికల అధికారి వల్లం కొండ శ్రీనివాస్ మాట్లాడుతూ.. చెన్ రాజ్ పండరి వరుసగా రెండవ సారి బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా గెలుపొందారు. ఉపాధ్యక్షునిగా పి.నరేష్ చారి, ప్రధాన కార్యదర్శిగా కె.కర్ణాకర్, సంయుక్త కార్యదర్శిగా బింగి భాస్కర్, కోశాధికారిగా బి.ప్రశాంత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మొహమ్మద్ అబ్దుల్ గఫర్, సిహెచ్ అశోక్, కే అరవింద్ రెడ్డి, బి అంజలి ఎన్నికైనారని తెలిపినారు.

# 27న జరిగే రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం

- ఉమ్మడి మెదక్ జిల్లా నుండి లక్ష మంది తరలింపు
- ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి, మాజీ ఎఫ్డీసి ప్రతాప్ రెడ్డి

✍ జయభేరి, వర్గల్, ఏప్రిల్ 15 :



బిఆర్ఎస్ పార్టీ 25 ఏండ్ల రజతోత్సవ ప్రస్థానంలో వరంగల్ సభ అత్యంత ప్రతిష్టాత్మకమని శాసనమండలి సభ్యులు డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి, మాజీ ఎఫ్డీసి చైర్మన్ ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. వర్గల్ లో మంగళవారం నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ సన్నాహక సమావేశానికి వారు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గులాబీ పార్టీ అధినేత కెసిఆర్ సారథ్యంలో స్వరాష్ట్రాన్ని సాధించి సగౌరవంగా బిఆర్ఎస్ జండా రెపరెపలాడుతుండగా, ఉమ్మడి మెదక్ జిల్లా నుండి లక్ష మందికి తగ్గకుండా రజతోత్సవ సభకు తరలి రావాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా తెలంగాణ ప్రజల కోట్లాది గొంతుకలను ఏకం చేసి సమైక్యపాలకుల కుట్రలు, కుతంత్రాలను తిప్పికొడుతూ ప్రత్యేక రాష్ట్ర కల సాకారం చేసిన కెసిఆర్ చరితను ఎవరూ కాదనలేని సత్యమని స్పష్టం చేశారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంతో పాటు పదేళ్లపాటు స్వర్ణ యుగాన్ని తలపించేలా పాలన చేసిన ఆయన పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి వందలాది పథకాలకు రూపకల్పన చేసి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచినట్లు తెలిపారు. కార్యకర్తలకు ప్రతిక్షణం తాము అందుబాటులో ఉంటామని, త్వరలోనే కెసిఆర్ ను గజ్వేల్ నియోజకవర్గ కార్యకర్తలు కలిసి ముచ్చటించే విధంగా ఏర్పాటు చేస్తామని అన్నారు. పార్టీకి కార్యకర్తలే బ్రాండ్ అంబాసిడర్లని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వర్గల్ మండల అధ్యక్షుడు వేలూరి వెంకట్ రెడ్డి, జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడు నాగరాజు, మాజీ జడ్పీటీసీలు బాలు యాదవ్, పోచయ్య, మాజీ ఎంపిపి లత రమేష్ గౌడ్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మండల పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# గొర్లివానిపాలెం గ్రామపంచాయతీకి లారస్ లాబ్స్ ట్రాక్టర్ వితరణ

- ట్రాక్టర్ పత్రాలను పంచాయతీ సర్పంచ్కి అందజేసిన లారస్ లాబ్స్ సంస్థ సీఈఓ చావా సత్యనారాయణ

✍ జయభేరి, పరవాడ:




పరవాడ ఫార్మా సిటీ లారస్ లాబ్స్ ఫార్మా కంపెనీ గొర్లివానిపాలెం గ్రామపంచాయతీకి కార్పొరేట్ సామాజిక బాధ్యత క్రింద గ్రామంలో చెత్త సేకరణకు పంచాయతీ వారు పడుతున్న ఇబ్బందులు దృష్ట్యా లారస్ లాబ్స్ సంస్థ నుంచి సీఈవో చావా సత్యన్నారాయణ, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ చావా నరసింహరావు చేతుల మీదగా చెత్త సేకరించే ట్రాక్టర్ని మంగళవారం సంస్థ రిజిస్టర్ ఆఫీస్ వద్ద మంగళవారం గొర్లెవాణిపాలెం గ్రామ పంచాయతీ సర్పంచ్ గొర్లి అమ్ములు,నాయుకులు గొర్లి గోపి కి అందజేశారు. ఈ సందర్భంగా లారస్ లాబ్స్ సీఈఓ చావా సత్యన్నారాయణ మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామాలను అభివృద్ధికి తమ సంస్థ ఎల్లవేళలా ముందుటుందని ఇప్పటికే సీస్సార్ నిధులు నుంచి మండలంలో,జిల్లాలలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని అన్నారు. తమ గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న లారస్ లాబ్స్ యాజమాన్యంకి,ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ చావా నరసింహరావుకి గొర్లివానిపాలెం సర్పంచ్ గొర్లి అమ్మలు,నాయుకులు గొర్లి గోపి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లారస్ లాబ్స్ సంస్థ ప్రతినిధులు,గ్రామ ఉప సర్పంచ్ గొర్లి రామారావు,వార్డ్ మెంబెర్స్ పోలిరెడ్డి అప్పారావు, పైల అప్పారావు, పంచాయతీ కార్యదర్శి తరుణ శ్రీ, పోలిరెడ్డి వెంకట్రావు, లారెన్స్ లాబ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లయన్ క్లబ్ ఎల్ఐసి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

✍ జయభేరి, దేవరకొండ :



దేవరకొండ పట్టణంలోని ఎల్ఐసి ఆఫీస్ ఎదురుగా లయన్స్ క్లబ్ ఎల్ఐసి సంయుక్తంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎల్ఐసి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎస్. రాము చౌహన్ తో కలిసి ప్రారంభింప చేసిన లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వస్కుల సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 44 డిగ్రీల ఎండ తీవ్రత పెరుగుతుందని ఎల్ఐసి తో పాటు బ్యాంకుకు వచ్చే ప్రజలకు దాహార్తిని తీర్చడం కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి సేవలు అందించేది లయన్స్ క్లబ్ అని తెలిపారు. ఈ చలివేంద్రాల ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్కరికి లయన్స్ క్లబ్ పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈ యొక్క చలివేంద్రాలని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వస్కుల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సముద్రాల ప్రభాకర్, ఎం జె ఎఫ్ గాజుల రాజేష్, నీల బుచ్చయ్య ,వనం శ్రీనివాస్, తిప్పర్తి రుక్మారెడ్డి, కర్నాటి గోవర్ధన్ నీల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ పార్టీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

**జయభేరి, ములుగు, ఏప్రిల్ 15 :**

భారతీయ జనతా పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ జన్మదినం సందర్భంగా బిజెపి పార్టీ ఆఫీసులో కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ములుగు మండలంలో పార్టీ విస్తరణ పై, ములుగు మండలంలో గల గ్రామలలో ఉన్న సమస్యలపై చర్చించడం జరిగింది. అలాగే కొమురవెల్లి దర్శనం చేసుకొని జిల్లా అధ్యక్షుడు బైరీ శంకర్ ఆయుర్ ఆరోగ్యాలు కల్పించాలని మల్లికార్జున స్వామిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు పల్లె రమేష్ యాదవ్, ములుగు మండల ఉపాధ్యక్షులు పుల్లబోయిన బాబు ముదిరాజ్, ములుగు గ్రామ సీనియర్ నాయకులు గుర్రాల కరుణాకర్ ముదిరాజ్ లు వారి నివాసం లో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు.

# ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన




**జయభేరి, పరవాడ :**

అనకాపల్లి జిల్లా అందత్వ నివారణ సంస్థ వారి సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్, అనిత ఆప్టికల్స్, ఆధ్వర్యంలో మంగళవారం శంకర్ ఫౌండేషన్ విజన్ సెంటర్ అనిత ఆప్టికల్స్, పరవాడ కాటా ఎదురుగా సినిమా హాల్ జంక్షన్ నందు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి చుట్టూ పక్కల గ్రామాలు నుంచి విశేష స్పందన కనిపించింది. ఈ వైద్య శిబిరంలో మొత్తము 96 మంది పరీక్షలు చేయ్యుంచుకొన్నారు అందులో కంటి చికిత్స 35 మందికి అవసరం అని కంటి వైద్య నిపుణులు డాక్టర్ కె గోపికృష్ణ తెలియజేశారు అలాగే 54 మందికి ఫ్రీమెడిసిన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో అన్ని కంటి వ్యాధులకు ఉచితంగా కంటి పరీక్షలు చేయబడ్డాయి అని ,శుక్లము ఆపరేషన్ కు ఎంపికైన నిరుపేదలకు డాక్టర్ సూచన మేరకు కాటారక్ట్ శాస్త్ర చికిత్స (లెన్స్) ఉచితంగా అమర్చి ఆపరేషన్ చేయబడుతుందని ఈ శిబిరంలో కంటి ఆపరేషన్ కి ఎంపికైన వారిని ఆపరేషన్ కొరకు శంకర్ ఫౌండేషన్కి పంపించడం జరిగిందని ఆయన తెలియ జేశారు.




# లింగారెడ్డి గూడా అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

- పోషకాహారాలపై అవగాహన కల్పించిన అంగన్వాడి ఉపాధ్యాయులు



**జయభేరి, షాద్‌నగర్, ఏప్రిల్ 15 :**

లింగారెడ్డి గూడా అంగన్వాడి కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం. ఈ కార్యక్రమంలో భాగంగా పోషక పక్షోత్సవాల్లో భాగంగా లింగారెడ్డి గూడ అంగన్వాడీ 2 కేంద్రంలో మంగళవారం పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ ఉపాధ్యాయులు కె. అమృత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలు, తీసుకోవాల్సిన ప్రాముఖ్యతను వివరించారు. లబ్ధిదారుల మాడ్యూల్, పోషకాహార లోపం ఉన్న పిల్లలు, ఉబకాయం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సి.డి.పి.ఓ షబానా, సూపర్వైజర్ జయలక్ష్మి, గ్రామ పంచాయతీ కార్యదర్శి అర్జున్ కుమార్, ఏ.ఎన్.ఎం. నిర్మల, ఆశా కార్యకర్తలు గ్రేస్, సరళ, మహిళా సంఘం అధ్యక్షులు జి. మాధవి, బి. మంగమ్మ, మహిళా సంఘం సభ్యులు, అంగన్వాడీ ఆయా కృష్ణమ్మ పాల్గొన్నారు.

# ఎల్ఐసి ఆఫీసులో అంగరంగ వైభవంగా దస్త్రం పూజ

- మొదట బ్రాంచ్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ శ్రీ రాము చౌహాన్ పూర్ణకుంభంతో, వేద తాళాల నడుమ, భాజా భజంత్రీలతో వందల మంది ఏజెంట్లు, కార్యాలయ సిబ్బంది తో పూజా మందిరంలోకి ప్రవేశించటం జరిగింది.

**జయభేరి, దేవరకొండ :**



ఉదయం 11 గంటల 40 నిమిషాలకు శాస్త్రోక్తంగా, అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాన్ని నిర్వహించటం జరిగింది. మొదట గణనాధుని పూజతో ప్రారంభమైన దస్త్రం పూజ సుమారుగా గంటపాటు అతిరథ మహారధుల సమక్షంలో నిర్వహించటం జరిగింది. ఈ సంవత్సరం దేవరకొండ ఎల్ఐసి కార్యాలయంలో వ్యాపారంలో మంచి పురోభివృద్ధి కనపరిచి, జాతీయస్థాయిలో మంచి గుర్తింపుని పొందేందుకు ఆ భగవంతుడు ప్రతి ఒక్కరికి ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలు కల్పించాలని విచ్చేసిన ప్రతి ఒక్కరూ ఆ భగవంతున్ని వేడుకోవడం జరిగింది.

ఈ పూజా కార్యక్రమానికి జాతీయ, జోనల్, డివిజన్ స్థాయి నాయకులు పాల్గొనటం విశేషం. పూజా కార్యక్రమానికి విచ్చేసిన ఏజెంట్లు ప్రతి ఒక్కరూ నూతన వ్యాపారంలో మంచి ప్రతిభను కనపరచాలని నూతన పాలసీలను తీసుకువచ్చి ఆ భగవంతుని ముందు ఉంచటం జరిగింది.

సంప్రదాయ దుస్తులు ధరించి ఎంతో నిష్టతో నిబద్ధతతో పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలతో పాటు విచ్చేసిన ప్రతి ఒక్కరికి దేవుని ప్రసాదం పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎల్ఐసి దేవరకొండ బ్రాంచ్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ శ్రీ రాము చౌహాన్ మాట్లాడుతూ.. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా కూడా ఈ సంవత్సరము దేవరకొండ బ్రాంచ్ జాతీయస్థాయిలో నెంబర్ వన్ గా నిలవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను, దీనికి ప్రతి ఒక్క ఏజెంట్ కార్యాలయ సిబ్బంది సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన క్లియా జాతీయ అధ్యక్షులు కౌటిక్ విటల్ మాట్లాడుతూ.. సంస్థ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఎల్ఐసి సంస్థ బాగుంటే మనందరం కూడా బాగుంటామని దేశాభివృద్ధికి వెన్నుముకగా నిలిచే మన ఎల్ఐసి ని మనం కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవాటు చేసుకుంటూ ప్రతి ఏజెంటు వ్యాపారంలో పురోభివృద్ధి సాధించాలని, అందుకు ఆ భగవంతుడు కృపాకటాక్షం అందించాలని ఆయన వేడుకున్నారు. ప్రతి ఒక్క ఏజెంటు కూడా ఎల్ఐసి నా మాతృ సంస్థ అని ఆ సంస్థ కోసం రేయింబవళ్లు కష్టపడి పని చేయాలని ఈ సందర్భంగా ఏజెంట్లను ఉద్దేశించి ప్రసంగించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో బ్రాంచ్ క్లాస్ 1 ఆఫీసర్స్, డెవలప్మెంట్ ఆఫీసర్లు లిమియా నాయక్, శంకర్ నాయక్, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ దేవరకొండ బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు నరేంద్ర, లక్ష్మీనారాయణ, లియాఫీ జాతీయ నాయకులు గాజుల రాజేష్, జోనల్ నాయకులు బి వెంకటయ్య, లియాఫీ సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు రామ స్వామి, సునీల్ కుమార్, డివిజన్ నాయకులు రంగారెడ్డి, గులం బాషా, లక్ష్మయ్య, బుచ్చిరెడ్డి, మార్కండేయ, ఎం శ్రీనివాస్, బి సత్యనారాయణ, వై వెంకటరెడ్డి, వనం శ్రీనివాస్ మకతులాల్ తో పాటు బ్రాంచ్ లియాఫీ నాయకులు నిరంజన్, శంకరయ్య, ఎన్ రాములు, ఏవోఐ నాయకులు చిన్న రామస్వామి పర్వత రెడ్డి, క్లియా నాయకులు ఎల్లయ్య, వెంకటయ్య, మల్లేశంతో పాటు కార్యాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# ఆచితూచి అడుగుల్లో గులాబీ దళపతి

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 15:**



కేసీఆర్‌కు రాజకీయాలు అనగా చెరువులో చేపలకు ఈత నేర్పడం వంటిది. అంత సహజం, అంత సులభం! తెలంగాణ ఉద్యమాన్ని విజయవంతంగా నడిపించి, రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఆయన, 2014 నుంచి2023 వరకు తెలంగాణను ముఖ్యమంత్రిగా నడిపించారు. అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లారు. అలాంటి నాయకుడికి ఎప్పుడు, ఎలా రాజకీయం చేయాలో బాగా తెలుసు. అందుకే ఇప్పుడు ఆయన జనంలోకి రాకుండా, నీడలో నిశ్శబ్దంగా తన వ్యూహాలను రచిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.తెలంగాణలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచాయి. ఇంకా నాలుగేళ్లకు పైగా అధికారం వారి చేతిలోనే ఉంది. అయితే, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ కొంత వెనుకబడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని పథకాలు అమలైనప్పటికీ, ఇంకా చాలా హామీలు నెరవేరాల్సి ఉంది. అంతేకాదు, కాంగ్రెస్‌లో అంతర్గత గ్రూప్ రాజకీయాలు, నాయకుల మధ్య సమన్వయ లోపం కూడా బయటకు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితులను కేసీఆర్‌దూరం నుండి గమనిస్తున్నారు. ప్రజల్లో కాంగ్రెస్ పట్ల అసంతృప్తి క్రమంగా పెరుగుతుందని, అది తమకు రాజకీయంగా లాభిస్తుందని ఆయన ఆశిస్తున్నారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ పాలన "పక్వానికి" చేరే వరకు వేచి చూడాలని కేసీఆర్ భావిస్తున్నారట.ఇప్పుడే జనంలోకి వెళ్లి కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉండదని కేసీఆర్ అభిప్రాయపడుతున్నారు. బదులుగా, సరైన సమయంలో, ప్రజల్లో అసంతృప్తి గరిష్ఠ స్థాయికి చేరినప్పుడు బయటకు వచ్చి మాట్లాడితే, ఆ మాటలు జనంలో బలంగా ప్రతిధ్వనిస్తాయని ఆయన నమ్ముతున్నారు. ఈ వ్యూహంతోనే ఆయన ఇప్పట్లో బహిరంగ సభలు, ర్యాలీలకు దూరంగా ఉంటున్నారు. అయితే, నిశ్శబ్దంగా ఉన్నప్పటికీ, ఆయన రాజకీయంగా నిష్క్రియంగా లేరు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో పార్టీ నాయకులతో సమావేశాలు నిర్వహిస్తూ, బీఆర్ఎస్‌ను బలోపేతం చేసే వ్యూహాలను రూపొందిస్తున్నారు. అదే సమయంలో, తనకు ఇష్టమైన వ్యవసాయాన్ని కూడా పర్యవేక్షిస్తూ సమయాన్ని గడుపుతున్నారు.ఏప్రిల్ 27వ తేదీన బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవంజరగనుంది. ఈ సందర్భంగా కేసీఆర్ బహిరంగ సభలో పాల్గొని, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. ఈ సభలో ఆయన తమ పార్టీ బలాన్ని చాటడంతో పాటు, కాంగ్రెస్ హామీల అమలులో విఫలమైన తీరును ఎత్తిచూపవచ్చు. అయితే, ఈ సభ తర్వాత ఆయన మళ్లీ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యే అవకాశం ఉందని అంటున్నారు.కాంగ్రెస్‌కు ఇంకా 45 నెలలకు పైగా అధికారం ఉంది. ఈ సమయంలో వారు చేసే తప్పిదాలే బీఆర్ఎస్‌కు రాజకీయంగా లాభిస్తాయని కేసీఆర్ ఆలోచిస్తున్నారు. ఆయన దృష్టి 2026 లేదా అంతకు మించి ఉన్నట్లు బీఆర్ఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అప్పటి వరకు పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడం, యువ నాయకులను ప్రోత్సహించడం, కాంగ్రెస్ బలహీనతలను జనంలోకి తీసుకెళ్లడం వంటి వ్యూహాలపై ఆయన దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.కేసీఆర్‌కు రాజకీయం ఒక పని అయితే, వ్యవసాయం ఒక అభిరుచి. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో ఆయన వ్యవసాయ కార్యకలాపాలను స్వయంగా పర్యవేక్షిస్తారు. రైతు సంక్షేమం కోసం తీసుకొచ్చిన రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు ఆయన వ్యవసాయం పట్ల అభిమానానికి నిదర్శనం. ఈ విశ్రాంతి సమయంలో కూడా ఆయన తన రైతు మనసును తామరాకు మీద నీటిబొట్టులా ఉంచుకున్నారని సన్నిహితులు చెబుతున్నారు. కేసీఆర్ ఇప్పుడు నిశ్శబ్దంగా ఉండొచ్చు, కానీ ఆయన రాజకీయ ఆటలో ఎప్పుడూ ఆచితూచి అడుగు వేస్తారు. సమయం కోసం వేచి ఉంటూ, పార్టీని బలోపేతం చేస్తూ, కాంగ్రెస్ తప్పిదాలను ఎత్తిచూపే అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. 2026 తర్వాత ఆయన రాజకీయంగా మళ్లీ యాక్టివ్ అయ్యే అవకాశం ఉందని బీఆర్ఎస్ వర్గాలు అంటున్నాయి.


# ఆవేదన చూస్తే కడుపు తరుక్కుపోతున్నది

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

**జయభేరి, హైదరాబాద్ :**



అకాల వర్షాలు, సాగు నీటి గోస, కరెంట్ కష్టాలను ఎదుర్కొని కౌలుకు తీసుకున్న 18 ఎకరాల్లో వరి సాగు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వ రూపంలో విపత్తు రైతన్నను నట్టేట ముంచింది. కొండంత సంబురంతో పంటను కొనుగోలు కేంద్రానికి తరలించి 20 రోజులు గడిచినా ప్రభుత్వం పంట కొనుగోలు చేయలేదు. దీంతో అకాల వర్షం ఆ రైతన్నను నిండా ముంచింది. కష్టపడి పండించిన ధాన్యమంతా తడిసి ముద్దయింది. ప్రభుత్వం ధాన్యం కొనకపోగా, పరిహారం కూడా చెల్లించకపోవడంతో తడిసిన ధాన్యం రాశి ముందు రైతు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నదని మాజీమంత్రి హరీష్‌రావు అన్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవటం లేదని చెప్పడానికి ఈ రైతుల కన్నీటి దృశ్యమే ప్రత్యక్ష సాక్ష్యం. రైతుల జీవితాల్లో కాలం తెచ్చిన విపత్తు కాదు, కాంగ్రెస్ తెచ్చిన విపత్తు ఇది. నిన్నటిదాకా సాగునీరు ఇవ్వక సావగొట్టారు. కరెంట్ కోతలతో పంటలను ఎండగొట్టారు. కష్టించి పండించిన ధాన్యాన్ని కొనకుండా నేడు అకాల వర్షాలపాలు చేసి ఆగం చేస్తున్నారు. నమ్మి ఓటేసినందుకు.. రైతుల గొంతు కోస్తున్న కాంగ్రెస్ సర్కారు దుర్మార్గ వైఖరిని యావత్ తెలంగాణ గమనిస్తున్నది. మొద్దు నిద్రలో ఉన్న కాంగ్రెస్ పాలకులారా రైతన్న గోస ఇకనైనా పట్టించుకోండి. వారి కన్నీటి కష్టాలు తీర్చండి. ఎద్దేడ్చిన ఎవుసం, రైతేడ్చిన రాజ్యం బాగుపడదదని గుర్తు పెట్టుకోండి. మీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని, నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.




# ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు షెడ్యూల్ తయారు చేయండి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**జయభేరి, జయశంకర్ భూపాలపల్లి:**

భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పనకు అన్ని మండలాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహణకు షెడ్యూల్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం భూ భారతి నూతన రెవెన్యూ చట్టం, ఇందిరమ్మ ఇండ్లు లబ్దిదారుల ఎంపిక ప్రక్రియపై అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలతో టెలి కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రతి మండలంలో భూ మాత నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహణకు షెడ్యూల్ రూపకల్పనతో పాటు అన్ని ఏర్పాట్లు చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. ప్రతి తహసిల్దార్ కార్యాలయంలో భూ భారతి చట్టం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి చట్టంపై ప్రజలకు సలహాలు, సూచనలు అందచేయాలని సూచించారు. మండల స్థాయిలో రెవెన్యూ సమస్యలపై సమగ్రమైన నోట్స్ తయారు చేయాలని ఆయన స్పష్టం చేశారు. నూతన చట్టం ప్రకారం మాత్రమే రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు, సక్సేషన్లు, సాదా బైనామ చేయాలని తెలిపారు. భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై రెవెన్యూ అధికారులు సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. భూ సమస్యల పరిష్కారం కొరకు వచ్చే ప్రజలతో గౌరవప్రదంగా వ్యవహరించాలని, ప్రజల సమస్యలను సావధానంగా విని పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. హెల్ప్ డెస్క్ కు వచ్చే ప్రజల వివరాలు రిజిష్టర్ లో నమోదు చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని పైలెట్ ప్రాజెక్ట్ క్రింద ములుగు, ఖమ్మం నారాయణపేట, కామారెడ్డిలలో ఒక్కొక్క మండలాన్ని ఎంపిక చేసిందని తెలిపారు మే నెలలో మన జిల్లాలో ఒక మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయాల్సి ఉంటుందని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ప్రజల నుండి వచ్చే సమస్యలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదికలు పంపాల్సి ఉంటుందని తెలిపారు. వేసవి దృష్ట్యా అవగాహన సదస్సులు నిర్వహణ లో అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారుల ఎంపికలో పూరెస్టు ఆఫ్ ది పూర్ కుటుంబాలను ఎంపిక చేయాలని తెలిపారు. ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండాలని సూచించారు. ప్రతి గ్రామం నుండి లబ్ధిదారుల జాభితా తయారు చేయాలని అట్టి జాబితా ప్రకారం విచారణకు గెజిటెడ్ అధికారులను విచారణ అధికారులుగా నియమించనున్నట్లు తెలిపారు. ప్రతి గెజిటెడ్ అధికారికి 200 మంది లబ్ధిదారుల జాభితా ఇవ్వడం జరుగుతుందని, ప్రతి రోజు కనీసం 25 మంది లబ్ధిదారుల విచారణ చేపట్టి ఇట్టి ప్రక్రియను 8 రోజుల్లో పూర్తి చేయాలని తెలిపారు. ఈ నెల 21వ తేదీ వరకు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాభితా అందజేయాలని, 22 నుంచి 30 తేదీ వరకు ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి అర్హుల ఎంపిక చేయాలన్నారు. ఈ టెలి కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు, తహసిల్దారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.



# కింగ్స్ కమాల్..

## కోల్‌కతాపై సంచలన విజయం

**చాహల్, యాన్సెన్ విజృంభణ**

**112 లక్ష్యఛేదనలో కేకేఆర్ 95 ఆలౌట్**

బ్యాటర్ల మెరుపులు, భారీ స్కోర్ల మ్యాచ్‌ల మధ్య సాగుతున్న ఐపీఎల్‌లో మంగళవారం లోస్కోరింగ్ థ్రిల్లర్ అభిమానులను ఊపేసింది. బంతి గింగిరాలు తిరిగిన ముల్లాన్‌పూర్ పిచ్‌పై పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) మధ్య జరిగిన ఉత్కంఠ పోరులో పంజాబ్‌దే పైచేయి అయింది. ఇరు జట్ల స్పిన్నర్లు వికెట్ల పండుగ చేసుకున్న పోరులో.. కింగ్స్ నిర్దేశించిన 112 పరుగుల స్వల్ప ఛేదనలో కేకేఆర్ 15.1 ఓవర్లలో 95 పరుగులకే చేతులెత్తేయడంతో పంజాబ్ 16 పరుగుల తేడాతో గెలిచింది. రఘువంశీ (28 బంతుల్లో 37, 5 ఫోర్లు, 1 సిక్స్), ఆండ్రీ రస్సెల్ (17) పోరాడారు. పంజాబ్ స్పిన్నర్లలో యుజ్వేంద్ర చాహల్ (4/28), యాన్సెన్ (3/17) కేకేఆర్‌ను దెబ్బతీశారు. మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్.. ప్రత్యర్థి బౌలర్ల ధాటికి 15.3 ఓవర్లలో 111 పరుగులకే కుప్పకూలింది. ప్రభ్‌సిమ్రన్ (15 బంతుల్లో 30, 2 ఫోర్లు, 3 సిక్సర్లు) టాప్ స్కోరర్. హర్షిత్ రాణా (3/25) ఆరంభంలోనే కింగ్స్‌ను దెబ్బతీయగా మిస్టరీ స్పిన్నర్లు సునీల్ నరైన్ (2/14), వరుణ్ చక్రవర్తి (2/21) కలిసి మిడిల్, లోయరార్డర్ పనిపట్టారు.

మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పంజాబ్‌కు ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్ (12 బంతుల్లో 22, 3 ఫోర్లు, 1 సిక్సర్) దూకుడుగానే ఇన్నింగ్స్‌ను ప్రారంభించినా ఈ ద్వయం నిష్క్రమించిన తర్వాత ఒక్కరంటే ఒక్కరూ క్రీజులో నిలవలేకపోయారు. నోకియా రెండో ఓవర్లో ఆర్య.. రెండు బౌండరీలు కొట్టగా వైభవ్ మూడో ఓవర్లో ప్రభ్‌సిమ్రన్.. 4, 6, 4, 4తో 20 పరుగులు రాబట్టాడు. పంజాబ్ ఇన్నింగ్స్‌లో ఇవే తొలి, ఆఖరి మెరుపులు. 4వ ఓవర్లో బౌలింగ్ మార్పుగా వచ్చిన హర్షిత్.. ఒకే ఓవర్లో ప్రియాన్ష్‌తో పాటు శ్రేయాస్ (0)నూ ఔట్ చేసి ఆతిథ్య జట్టుకు భారీ షాకిచ్చాడు.

ఆ మరుసటి ఓవర్లోనే బంతినందుకున్న వరుణ్.. జోష్ ఇంగ్లిష్ (2)ను క్లీన్‌బౌల్డ్ చేయడంతో పంజాబ్ కష్టాలు రెట్టింపయ్యాయి. హర్షిత్ బౌలింగ్‌లో రెండు భారీ సిక్సర్లతో అలరించిన ప్రభ్‌సిమ్రన్ కూడా.. అదే ఓవర్లో ఆఖరి బంతికి బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో రమణ్‌దీప్ సింగ్ క్యాచ్‌తో పెవిలియన్ చేరాడు. అక్కడ్నుంచి పంజాబ్ ఇన్నింగ్స్ కోలుకోలేదు. నోకియా 9వ ఓవర్లో నెహాల్ వధేర (10) రెండు బౌండరీలు బాదినా నాలుగో బంతికి ఔట్ అయ్యాడు. ఇక ఈ సీజన్‌లో అత్యంత చెత్తగా ఆడుతున్న గ్లెన్ మ్యాక్స్‌వెల్ (7) మరోసారి తన వైఫల్య ప్రదర్శనను కొనసాగిస్తూ.. వరుణ్ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. సుయాన్ష్ (4), యాన్సెన్ (1)ను నరైన్ ఒకే ఓవర్లో పెవిలియన్‌కు పంపాడు. పంజాబ్ భారీ ఆశలు పెట్టుకున్న శశాంక్ సింగ్ (18)ను 16వ ఓవర్లో అరోరా ఎల్బీగా వెనక్కిపంపగా అదే ఓవర్లో బార్ట్‌లెట్ (11) రనౌట్ అవడంతో కింగ్స్ ఇన్నింగ్స్‌కు తెరపడింది.

స్వల్ప ఛేదనలో కేకేఆర్ కూడా 7 పరుగులకే ఓపెనర్లను కోల్పోవడంతో పంజాబ్‌లో ఆశలు రేగాయి. యాన్సెన్ తొలి ఓవర్లోనే నరైన్ (4)ను బౌల్డ్ చేయగా ఐపీఎల్‌లో తొలి మ్యాచ్ ఆడుతున్న బార్ట్‌లెట్.. రెండో బంతికే డికాక్ (2)ను ఔట్ చేసి కోల్‌కతాకు షాకిచ్చాడు. కానీ ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా క్రీజులోకి వచ్చిన రఘువంశీ.. కెప్టెన్ రహానేతో కలిసి కోల్‌కతాను ఆదుకున్నాడు. ఎదుర్కొన్న తొలి బంతినే బౌండరీగా మలిచిన అతడు.. కింగ్స్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. యాన్సెన్ బౌలింగ్‌లో రెండు బౌండరీలు కొట్టిన రఘువంశీ.. బార్ట్‌లెట్ ఆరో ఓవర్లో 6, 4తో రెచ్చిపోయాడు.

ఈ సీజన్‌లో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్న చాహల్.. కీలక సమయంలో సత్తా చాటాడు. వరుస ఓవర్లలో అతడిచ్చిన షాకులకు కోల్‌కతాకు కుదేలైంది. తన తొలి ఓవర్లోనే అతడు.. రహానేను వికెట్ల ముందు బలిగొని 55 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. మరుసటి ఓవర్లో రఘువంశీనీ ఔట్ చేసిన చాహల్.. 12వ ఓవర్లో ప్రమాదకర రింకూ సింగ్ (2)తో పాటు రమణ్‌దీప్‌నూ పెవిలియన్‌కు పంపడంతో వన్‌సైడ్ వార్ అనుకున్న మ్యాచ్ కాస్తా ఉత్కంఠగా మారింది. యాన్సెన్ కూడా 13వ ఓవర్లో హర్షిత్ (3)ను బౌల్డ్ చేయగా అర్ష్‌దీప్.. వైభవ్‌ను పెవిలియన్‌కు పంపడంతో కేకేఆర్ 9వ వికెట్ కోల్పోయింది. యాన్సెన్.. 16వ ఓవర్లో తొలి బంతికి రస్సెల్‌ను క్లీన్‌బౌల్డ్ చేసి పంజాబ్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.

1 ఐపీఎల్‌లో ఒక జట్టు అత్యల్ప స్కోరును కాపాడుకోవడం ఇదే ప్రథమం. గతంలో చెన్నై (116) పంజాబ్‌తో మ్యాచ్‌లో ఈ లక్ష్యాన్ని కాపాడుకుంది. ఐపీఎల్‌లో ఒక జట్టుపై అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో నరైన్ (పంజాబ్‌పై 36 వికెట్లు) అందరి కంటే ముందున్నాడు. గతంలో ఈ రికార్డు ఉమేశ్ యాదవ్ (పంజాబ్ పైనే 35 వికెట్లు) ఉంది.

4 ఐపీఎల్‌లో పంజాబ్‌కు ఇది నాలుగో అత్యల్ప స్కోరు కాగా కేకేఆర్‌పై ఆలౌట్ అవడం ఇది రెండోసారి.

**సంక్షిప్త స్కోర్లు**

పంజాబ్: 15.3 ఓవర్లలో 111 ఆలౌట్ (ప్రభ్‌సిమ్రన్ 30, ప్రియాన్ష్ 22, హర్షిత్ 3/25, నరైన్ 2/14);
కోల్‌కతా: 15.1 ఓవర్లలో 95 ఆలౌట్ (రఘువంశీ 37, రస్సెల్ 17, చాహల్ 4/28, యాన్సెన్ 3/17)



# ఏం తినాలో.. ఏం తినొద్దో... ఇప్పుడే తెలుసుకోండి..!

పెళ్లి అనంతరం మహిళల జీవన విధానం ఒక్కసారిగా మారిపోతుంది. కొత్త బాధ్యతలు, కొత్త వాతావరణం, కొత్త సంబంధాలు అన్నీ కలిపి ఆమె జీవితంలో బహుళ మార్పులు తీసుకువస్తాయి. ఈ మార్పుల ప్రభావం ఆహారపు అలవాట్లపై కూడా పడుతుంది. అనేక సందర్భాల్లో పెళ్లి తర్వాత మహిళలు బరువు పెరగడం సహజంగా జరుగుతుంది. అయితే కొన్ని చిన్న చిన్న మార్పులతో ఈ బరువు పెరుగుదలపై నియంత్రణ సాధించవచ్చు. ఆ మార్పులు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.

పెళ్లయ్యాక ఎక్కువ మంది మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి తరచూ వివిధ ఆహార కార్యక్రమాల్లో పాల్గొంటారు. బంధువుల ఇంట్లో విందులు, పార్టీల్లో భోజనాలు ఇలా తరచూ జరుగుతుంటాయి. ఈ సందర్భాల్లో ఇది నాకు చాలా ఇష్టం, ఇది తినడం తప్పేలా లేదు అనే భావనతో అన్నీ ఎక్కువగా తినకండి. లిమిటెడ్ గా తినడం వల్ల రుచిని అనుభవించగలుగుతారు. అదే సమయంలో బరువు పెరిగే ప్రమాదం కూడా ఉండదు.

భోజనం మొత్తాన్ని తగ్గించుకోవాలంటే మొదట తేలికపాటి ఆహారాన్ని తీసుకునే అలవాటు పెంచుకోవాలి. ఉదాహరణకు తాజా కూరగాయలతో తయారైన సలాడ్లు, వెజిటబుల్ సూప్ లేదా పండ్ల చాట్ వంటివి ముందుగా తినడం మంచిది. ఇవి కడుపుని కొంతవరకూ నింపేసి తర్వాత ఎక్కువగా అన్నం తినకుండా నియంత్రించగలవు. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది.

నీరు తక్కువగా తాగడం వల్ల శరీరంలోని వ్యర్థాలు బయటకు వెళ్లక బరువు పెరగడానికి కారణమవుతుంది. రోజంతా కనీసం 8-10 గ్లాసుల నీరు తాగాలి. ఇది శరీరంలోని టాక్సిన్లను తొలగించి మెటబాలిజాన్ని మెరుగుపరుస్తుంది.


పెళ్లైన కొత్తలో మిఠాయిల విందులు ఎక్కువగా ఉంటాయి. ప్రతి ఒక్కరూ స్వీట్స్‌తో ఆదరిస్తారు. అయితే వీటిని పరిమిత మోతాదులోనే తినాలి. తరచుగా మిఠాయిలను తీసుకోవడం వల్ల శరీరంలో చక్కెర స్థాయిలు పెరిగి కేలరీలు అధికంగా చేరతాయి. ఇది బరువు పెరగడానికి దారితీస్తుంది.

నిత్యం కనీసం 30 నిమిషాలు నడవడం చాలా మంచిది. ఈ సమయాన్ని జీవిత భాగస్వామితో గడిపితే మరింత మంచిది. ఒకవైపు ఆరోగ్యానికి మేలు చేస్తుంది, మరోవైపు రిలేషన్‌షిప్ బలపడుతుంది. వాకింగ్ వల్ల శరీరం చురుకుగా ఉంటుంది, క్యాలరీలు ఖర్చవుతాయి.

వాకింగ్‌కు తోడు కాస్త శారీరక వ్యాయామం చేస్తే శరీరం మరింత ఆరోగ్యంగా ఉంటుంది. యోగా, బ్రిస్ట్ వర్కౌట్స్, స్ట్రెచింగ్ వ్యాయామాలు శరీరాన్ని సజీవంగా ఉంచుతాయి. రోజూ కనీసం 20 నిమిషాలు ఫిజికల్ యాక్టివిటీ కోసం కేటాయించండి.

రోజూ తీసుకునే భోజనంలో పచ్చికూరగాయలు, మిలెట్లు, చిక్కుడు గింజలు వంటి ఫైబర్ అధికంగా ఉండే పదార్థాలను చేర్చాలి. ఇవి జీర్ణం బాగా అవుతాయి, అలసట రాకుండా చేస్తాయి. హెల్తీ ఫ్యాట్స్ ఉన్న పదార్థాలు కూడా శరీరానికి మంచి శక్తిని అందిస్తాయి.

మార్కెట్‌లో దొరికే ప్యాకెట్ జ్యూసులు, ఎనర్జీ డ్రింక్స్‌లో అధికంగా చక్కెర, కలరింగ్ ఏజెంట్లు ఉండటం వల్ల అవి బరువు పెరగడానికి దోహదపడతాయి. వీటి బదులు ఇంట్లోనే తాజా పండ్ల రసాలు తాగడం మంచిది. ఇది సహజంగా శక్తిని ఇస్తుంది. ఈ చిట్కాలతో మన జీవన విధానంలో చిన్న చిన్న మార్పులు చేస్తే పెళ్లి తర్వాత బరువు పెరగకుండా ఆరోగ్యంగా జీవించవచ్చు.





# నమ్మకం లేకపోతే ఏ బంధం నిలవదు..!

వివాహం అనేది కేవలం ఒక సంప్రదాయ సంబంధం కాదు. సద్గురు ఏం చెబుతున్నారో తెలుసా..? వివాహం అనేది మన జీవితంలో మనకు తోడుగా ఉండే వ్యక్తిని ఎంచుకోవడమే. శారీరక, భావోద్వేగ, మానసిక, ఆర్థిక, సామాజిక అవసరాలను పూరించగల వ్యక్తి జీవిత భాగస్వామిగా ఉండాలి. ఈ బంధం నిశ్చలంగా నిలవాలంటే దానికి శ్రద్ధ అవసరం. ఏ బంధమైనా రోజురోజుకూ మారుతూ ఉంటుంది. మనం నిర్లక్ష్యం చేస్తే దూరమవుతుంది. కాబట్టి మన జీవిత భాగస్వామితో అనుబంధాన్ని ప్రేమగా, శ్రద్ధగా చూసుకోవాలి.

ఒక మంచి వివాహ బంధానికి ముఖ్యమైన అంశం సంభాషణ. మనసులో ఉన్న విషయాలను బహిరంగంగా చెప్పుకోవడం ద్వారా భావోద్వేగాలు సమతుల్యతలో ఉంటాయి. ఇది ఇద్దరినీ దగ్గర చేస్తుంది. అలాగే ఒకరినొకరు గౌరవించడం కూడా ఎంతో అవసరం. వివాహం వల్ల మన వ్యక్తిత్వాన్ని కోల్పోవాల్సిన పని లేదు. ప్రతి వ్యక్తికీ తన సొంత అభిప్రాయాలు ఉంటాయి. అవి భిన్నంగా ఉన్నా.. గౌరవించాలి. ఆ గౌరవం బంధాన్ని నిలబెట్టే శక్తిగా ఉంటుంది. ఇక నమ్మకం గురించి చెప్పాలంటే.. అది లేకుండా ఎలాంటి సంబంధం నిలవదు. భర్తా భార్యల మధ్య పరస్పర నమ్మకం పెరిగేలా మాట్లాడుకోవాలి. ఒకరి నమ్మకాన్ని మరొకరు దెబ్బతీయకుండా జాగ్రత్త పడాలి. నమ్మకమే బంధాన్ని బలంగా ఉంచుతుంది. వివాహం అనగా ఒకరి ప్రపంచంలో మరొకరిని కలిపేసుకోవడం కాదు. ప్రతి ఒక్కరికీ వ్యక్తిగతంగా ఎదిగే అవకాశం ఉండాలి. కొన్ని విషయాల్లో స్వేచ్ఛ ఇవ్వడం ద్వారా బంధం మరింత ఆరోగ్యంగా మారుతుంది. మానవ సంబంధాల్లో మనుషుల మధ్య అంచనాలు, అబద్ధాలు, అపార్థాలు సాధారణం. అప్పుడు క్షమించగలగడం ఎంతో అవసరం. చిన్నచిన్న సమస్యల్ని పట్టుకొని బంధాన్ని బలహీనంగా మార్చుకోవద్దు. వ్యక్తిగత లక్షణాలను అంగీకరించగలగడం ద్వారా మన హృదయంలో దయ, ప్రేమ పెరుగుతుంది. మన భాగస్వామిలో ఉన్న అసంపూర్ణతలను అంగీకరించగలగడం ద్వారా జీవితం మరింత సులభంగా సాగుతుంది. జీవిత భాగస్వామి చేసిన పనుల్ని బాధ్యతగా కాకుండా ప్రేమతో చూసుకోవాలి. మనకు చేయబడ్డ సహాయానికి కృతజ్ఞత చూపడం ద్వారా బంధం బలపడుతుంది. భార్యా భర్తలు ఒకే ఇంట్లో ఉన్నా.. కొన్ని ప్రత్యేకమైన సందర్భాలు కలిసి గడపడం అవసరం. కలిసి విహారయాత్రలు, భోజనాలు, లేదా మంచి సమయాన్ని గడపడం ద్వారా ప్రేమ మరింత పెరుగుతుంది. ఈ ప్రయాణంలో నవ్వు ఎంతో కీలకమైనది. ఒకరితో ఒకరు నవ్వుతూ మాట్లాడుకోవడం వల్ల మధ్యలో ఉండే ఒత్తిడులు పోతాయి. ఈ విధంగా సాన్నిహిత్యం పెరుగుతుంది.

సద్గురు చెప్పిన ఈ సూచనలు వివాహ బంధాన్ని ప్రేమతో, శాంతితో నింపడానికి చాలా ఉపయోగపడతాయి. ఈ బంధం సాధారణంగా ఉండకూడదంటే, ఇద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకునే మనసుతో, పరస్పర గౌరవంతో, క్షమించగల స్వభావంతో జీవించాలి. ఇలాంటి విలువలు ఉన్నప్పుడు మాత్రమే ఈ అనుబంధం బలంగా మారుతుంది.

06
జయభేరి సినిమా
16-04-2025
బుధవారం
jayabheridaily.com



## ఈ అందాల నటి పెళ్లి వేడుకలు షురూ... కాబోయే భర్తతో క్యూట్ పోజులు


మాట, వినికిడి శక్తి లేకపోయిన తన టాలెంట్‌తో మంచి నటిగా పేరు ప్రఖ్యాతలు సంపాదించింది నటి అభినయ. తమిళనాడుకు చెందిన ఈమె తెలుగులో కూడా చాలా చిత్రాలు చేసింది. 2008లో తెలుగులో వచ్చిన 'నేనింతే' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ఈ ముద్దుగుమ్మ ఇందులో చిన్న పాత్రలో కనిపించి అలరించింది. ఆ తర్వాత కింగ్, శంభో శివ శంభో, దమ్ము, ఢమరుకం, జీనియస్, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, ధృవ, రాజుగారి గది 2, సీతా రామం, ది ఫ్యామిలీ స్టార్ వంటి చిత్రాల్లో తన నటనతో ఎంతగానో మెప్పించింది. తమిళంలో ఆమె నటించిన 'నాడోడిగల్' చిత్రానికి గాను బెస్ట్ డెబ్యూ యాక్ట్రెస్ విభాగంలో ఫిల్మ్ ఫేర్ అవార్డును కూడా అందుకుంది.

15 ఏళ్లుగా ఇండస్ట్రీలో రాణిస్తున్న అభినయ తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం ఇలా పలు భాషలలో చిత్రాలు చేసింది. ఇక ఇప్పుడు వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమైంది. మరికొన్ని గంటల్లోనే మూడు ముళ్ల బంధంలోకి అడుగుపెట్టనున్న అభినయ.. తాజాగా తన పెళ్లి వేడుకలకి సంబంధించిన ఫొటోలని తన సోషల్ మీడియాలో షేర్ చేసింది. కార్తీక్ అనే వ్యక్తిని అభినయ పెళ్లి చేసుకోనుండగా, అతనితో కలిసి మెహందీ వేడుకలో దిగిన క్యూట్ ఫొటోలను తన సోషల్ మీడియాలో షేర్ చేసింది. ప్రస్తుతం ఈ పిక్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. హైదరాబాద్‌లోని ప్రముఖ కన్వెన్షన్ హాల్‌లో వీరిద్దరి పెళ్లి జరగనున్నట్లు టాక్. నటి అభినయ పెళ్లి చేసుకోబోతున్న వ్యక్తి హైదరాబాద్ వాసి కాగా, అతనికి పలు వ్యాపారాలు ఉన్నట్టు తెలుస్తోంది. అభినయతో అతనికి 15 సంవత్సరాల నుంచే పరిచయముందని, అప్పటి నుండే ఇద్దరూ ప్రేమలో ఉన్నారని టాక్. ఎట్టకేలకి ఈ జంట పెళ్లికి సిద్ధమయ్యారు. కాగా, హైదరాబాద్ లోని ప్రముఖ వెంకటేశ్వర స్వామి టెంపుల్ లో వీరి నిశ్చితార్థపు వేడుక అతి సన్నిహితుల మధ్య జరిగింది. పెళ్లి కూడా హైదరాబాద్‌లోనే జరుగుతున్న నేపథ్యంలో ఈ వేడుకకి ఇండస్ట్రీకి చెందిన పలువురు సినీ ప్రముఖులు కూడా హాజరు కానున్నట్టు తెలుస్తుంది.

## మళ్లీ యాక్షన్ షురూ!



మహేష్‌బాబు, రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ యాక్షన్ అడ్వెంచర్ మూవీకి సంబంధించిన అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఒడిశాలోని పర్వత ప్రాంతాల్లో జరిపిన తొలి షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై కీలక ఘట్టాలను తెరకెక్కించారు. ఆ తర్వాత షూటింగ్‌కు కాస్త విరామాన్ని ప్రకటించింది చిత్రబృందం. ఈ గ్యాప్‌లో మహేష్‌బాబు, రాజమౌళి ఇద్దరూ విదేశాలకు వెళ్లారు. ఇటలీ విహార యాత్రకు వెళ్లిన మహేష్‌బాబు మంగళవారం హైదరాబాద్‌కు తిరిగొచ్చారు. 'ఆర్‌ఆర్‌ఆర్' డాక్యుమెంటరీ ప్రచారం కోసం రాజమౌళి కుటుంబ సభ్యులతో కలిసి జపాన్ వెళ్లారు. ఆయన వచ్చిన వెంటనే రెండో షెడ్యూల్‌ను మొదలుపెడతారని సమాచారం. ఈ రెండో షెడ్యూల్‌లో కీలకమైన యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కిస్తారని చెబుతున్నారు. ఇక ఈ సినిమాలో మహేష్‌బాబు..రుద్ర అనే పాత్రలో కనిపిస్తారని వార్తలొస్తున్నాయి. దాదాపు వెయ్యికోట్ల భారీ వ్యయంతో జంగిల్ యాక్షన్ అడ్వెంచర్‌గా నిర్మాత కె.ఎల్.నారాయణ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.



## తూచ్ అలాంటిదేమీ లేదు..

నషా నషా అంటూ ఈ మధ్య నార్త్‌లో యమాగా స్టెప్పులేశారు మిల్కీ బ్యూటీ. సౌత్‌లో స్పెషల్ సాంగులు చేయడం తమన్నాకు అలవాటే. అయితే ఈ మధ్య స్త్రీ2లో ఆమె చేసిన స్టెప్పులు చూశాక, నార్త్ మేకర్స్ కూడా తమన్నా కాల్షీట్ల కోసం ఎంక్వయిరీలు మొదలుపెట్టేశారు. సినిమా కథ నచ్చితే పెద్దదా, చిన్నదా అని చూడనన్నది తమన్నా చెబుతున్న మాట. అంతే కాదు, జనాలను మెప్పించి, బాక్సాఫీస్ దగ్గర కాసులు కురిపించిన ప్రతి కథా తన దృష్టిలో పెద్దదేనంటున్నారు ఈ లేడీ. ఇంతకీ తమన్నా పెళ్లెప్పుడు చేసుకుంటారని ఆరా తీస్తే... బిగ్ నో అనే మాట వినిపిస్తోంది. ఇప్పట్లో అలాంటి ఉద్దేశమే లేదన్నారు తమన్నా. కెరీర్ మీద దృష్టి పెడుతున్నానని చెప్పారు. తెలుగులో ఆమె నటించిన సూపర్ నేచురల్ థ్రిల్లర్ చిత్రం ఓదెల 2 ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.



## రామ్ చరణ్ నా ఫస్ట్ క్రష్..

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఫాలోయింగ్ గురించి చెప్పక్కర్లేదు. ఆర్‌ఆర్‌ఆర్ మూవీతో ప్రపంచవ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్న చరణ్.. ఇప్పుడు డైరెక్టర్ బుచ్చిబాబు సన దర్శకత్వంలో పెద్ది చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఉప్పెన తర్వాత కొంతకాలం గ్యాప్ తీసుకున్న బుచ్చిబాబు.. ఇప్పుడు రామ్ చరణ్ తో మరో సంచలనం సృష్టించేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల విడుదలైన పెద్ది ఫస్ట్ షాట్ గ్లింప్స్ సినిమాపై ఓ రేంజ్ హైప్ క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో చరణ్ ఊర మాస్ అవతారంలో కనిపించడం.. అలాగే బుచ్చి బాబు డైరెక్షన్ తో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రికార్డ్ కొల్లగొట్టడం ఖాయమని తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. రామ్ చరణ్ అంటే తనకు చాలా ఇష్టమని.. తనే ఫస్ట్ క్రష్ అని.. ఎంతో క్యూట్ గా నవ్వుతారని మనసులోని మాటలు బయటపెట్టింది ఓ హీరోయిన్. ప్రస్తుతం ఆ అమ్మడు చేసిన కామెంట్స్ నెట్టింట వైరలవుతున్నాయి. ఆ హీరోయిన్ మరెవరో కాదండి.. తెలుగు హీరోయిన్ కావ్య థాపర్. మోడలింగ్ నుంచి కెరీర్ స్టార్ట్ చేసిన ఈ బ్యూటీ టాలీవుడ్ సినీ రంగంలోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ మాయ పేరేమిటో సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైన ఈ అమ్మడు.. ఫస్ట్ మూవీతోనే ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత మాస్ మహారాజా రవితేజ సరసన ఈగల్ చిత్రంలో కనిపించింది. బాక్సాఫీస్ వద్ద ఈ మూవీ డిజాస్టర్ కావడంతో కావ్యకు అంతగా గుర్తింపు రాలేదు. అలాగే తెలుగులో సందీప్ కిషన్ జోడిగా ఊరు పేరు భైరవకోన, రామ్ పోతినేని జోడిగా డబుల్ ఇస్మార్ట్ చిత్రాల్లో నటించింది. గోపీచంద్ సరసన విశ్వం మూవీలో కనిపించినప్పటికీ ఈ బ్యూటీకి అంతగా క్రేజ్ రాలేదు. ప్రస్తుతం కావ్య థాపర్ తెలుగుతో పాటు తమిళంలోనూ పలు చిత్రాల్లో నటిస్తుంది.



## సినిమాకొచ్చిన బజ్ చూస్తుంటే భయం వేస్తుంది

'శివశక్తి పాత్ర, 'ఓదెల 2' సినిమా నా కెరీర్‌లో చాలా స్పెషల్. 20ఏళ్లుగా ఎన్నో ప్రొడక్షన్స్‌లో పనిచేశా. కానీ ఇంత పాషన్ వున్న ప్రొడ్యూసర్స్‌ని, క్రియేటర్స్‌ని చూడలేదు. ఇలాంటి టీమ్ అరుదుగా దొరుకుతుంది. ఈ సినిమాలో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నా. 17వ తేదీ కోసం అందరితోపాటు నేను కూడా ఆతృతగా ఎదురుచూస్తున్నా' అని తమన్నా అన్నారు.

ఆమె ప్రధాన పాత్రలో నటించిన సూపర్ నాచురల్ థ్రిల్లర్ 'ఓదెల 2'. అశోక్‌తేజ దర్శకుడు. సంపత్‌నంది దర్శకత్వ పర్యవేక్షణ చేస్తూ.. డి.మధుతో కలిసి ఈ సినిమాను నిర్మించారు. ఈ నెల 17న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హీరో శర్వానంద్ అతిథిగా విచ్చేసి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు.

'ఈ సినిమాకు వచ్చిన బజ్ చూస్తుంటే భయం వేస్తోంది. డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌కీ, రైటింగ్ డిపార్ట్‌మెంట్‌కీ థ్యాంక్స్ చెప్పుకుంటున్నా. ఈ సినిమాకోసం ఓ రీసెర్చ్ జరిగింది. ఎన్నో పుస్తకాలను రిఫర్ చేశాం. డైరెక్టర్ అశోక్ వెరీ పాజిటీవ్ సోల్. అతనికి మంచి జరగాలనే 'ఓదెల 2' స్టార్ట్' చేశా.

సౌందర్ రాజన్ విజువల్స్, అజనీష్ నేపథ్య సంగీతం ఈ సినిమాను హైలైట్స్. ఓ గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇది' అని సంపత్‌నంది తెలిపారు. ఇంకా నిర్మాత డి.మధు, దర్శకుడు అశోక్‌తేజ, నిర్మాత రాధామోహన్, నటుడు వశిష్ట ఎన్.సింహా, ఆర్ట్ డైరెక్టర్ రాజీవ్ నాయర్‌లతోపాటు మరో అతిథి దర్శకుడు వశిష్ట కూడా మాట్లాడారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com